మెట్టప్రాంతంలో మోస్తరు వర్షం

ఆత్మకూరు/అనంతసాగరం, మే 17 : మెట్ట ప్రాంతంలో కురుస్తున్న వర్షం అన్నదాతలో ఆశలు చిగురింపజేస్తోంది. ఆత్మకూరు, అనంతసాగరం మండలాల్లో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. దీంతో ఎండ తీవ్రత నుంచి ఉపసమనం లభించడంతో ప్రజలు కొంత ఊపరి పీల్చుకున్నారు. గత ఏడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కూడా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో అన్నదాతలు సాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కానీ ఈ ఏడాది మే నెల రెండో వారం నుంచే వర్షాలు కురవడంతో వ్యవసాయం జోరుగా సాగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



మైనింగ్ శాఖే

'తెల్ల'బోయింది!

- సైదాపురంలో క్వార్ట్జ్ తవ్వకాలపై మైనింగ్ దాడులు
- అనుమతుల్లేకుండా తవ్వుతుండగా ఐదు వాహనాల సీజ్
- రూ.1.5 కోట్ల పెనాల్టీ.. పోలీసుస్టేషన్‌లో అప్పగింత
- కానీ వారికి తెలియకుండానే కేసు నమోదు
- కోర్టులో హాజరు.. వాహనాల విడుదల
- ఇప్పుడు పెనాల్టీలు ఎవరు వసూలు చేస్తారు?

నెల్లూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : అధికారం ఉంటే ఏమైనా చేయొచ్చని అక్రమార్కులు నిరూపిస్తున్నారు. క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల్లో అడ్డంగా దొరికిపోయినా తమ అంగ, ఆర్థిక బలంతో సులభంగా తప్పించుకుంటున్నారు. సైదాపురం మండలం జోగుపల్లి వద్ద జరిగిన వ్యవహారమే ఇందుకు నిదర్శనం. ఎన్నికల కోడ్ ముందు వరకూ క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల వైపు కన్నెత్తి చూసేందుకు సాహసించని అధికారులు ఇప్పుడు వరుస దాడులు చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలతో అక్రమ మైనింగ్ జరిగిన ప్రాంతాల్లో తనిఖీలు చేస్తూ ఏ స్థాయిలో అక్రమ తవ్వకాలు జరిగాయన్నది నిర్ధారిస్తున్నారు. ఈ క్రమంలో గత నెలలో జోగుపల్లి వద్ద ఓ మైన్‌లో అక్రమ తవ్వకాలను మైనింగ్ శాఖ అధికారులు గుర్తించారు. ఆ మైన్ పట్టా భూమిలో ఉన్నప్పటికీ క్వార్ట్జ్ తవ్వకాలకు మాత్రం అనుమతుల్లేవు. ఆకస్మికంగా దాడులు చేసిన మైనింగ్ శాఖ సిబ్బంది ఐదు ప్రొక్లెయిన్, లారీలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అక్కడ జరిగిన అక్రమ తవ్వకాలను కొలతలు వేసి గుర్తించారు. సదరు మైన్ యజమానికి దాదాపు రూ.1.50 కోట్ల పెనాల్టీలు విధించారు. మైనింగ్ శాఖ ఒక టన్నుకు రూ.900 చొప్పున పెనాల్టీ విధిస్తోంది. ఈ లెక్కన రూ.1.50 కోట్లు అంటే 16 వేల టన్నులకు పైగా క్వార్ట్జ్‌ను అక్రమంగా తవ్వినట్లన్నమాట. ఈ మొత్తం క్వార్ట్జ్ విలువ బహిరంగ మార్కెట్లో సుమారు రూ.50 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇంత భారీస్థాయిలో జరిగిన తవ్వకాలకు సంబంధించి మైనింగ్ అధికారులు పట్టుకున్న వాహనాలను సైదాపురం పోలీసు స్టేషన్‌లో సేఫ్ కస్టడీకి అప్పగించారు. పెనాల్టీ చెల్లించే వరకూ ఆ వాహనాలను విడుదల చేయవద్దంటూ పోలీసులను కోరారు. అయితే ఈ వాహనాలన్నిటినీ విడుదల చేసినట్లు తాజాగా తెలిసింది. రెవెన్యూ సిబ్బంది ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి ఈ వాహనాలను కోర్టులో హాజరుపర్చినట్లు పోలీసులు చెబుతున్నారు. కోర్టు ఆదేశాలతో వాహనాలను విడుదల చేసినట్లు వెల్లడించారు. అయితే పట్టా భూమిలో అనుమతుల్లేకుండా తవ్వకాలు జరిపిన వ్యవహారంలో మైనింగ్ శాఖ సిబ్బంది పట్టుకున్న వాహనాలపై రెవెన్యూ సిబ్బంది ఎలా కేసు పెడతారన్నది ప్రశ్నార్థకంగా మారింది. మరి పోలీసులైనా ఈ సమాచారాన్ని మైనింగ్ అధికారులు ముందుగా ఎందుకు తెలియజేయలేదన్న దానిపై కూడా అనుమానాలు కలుగుతున్నాయి. రెవెన్యూ వాళ్ల ఫిర్యాదు చేశారు.. పోలీసులు కేసు కట్టారు.. మరి ఇప్పుడు ఆ పెనాల్టీ రూ.1.50 కోట్లను ఎవరు వసూలు చేస్తారు? ఎలా వసూలు చేస్తారు? అన్నది జిల్లా ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది. ఒక వేళ పోలీసులు కేసు కట్టినా మైనింగ్ చట్టాల ప్రకారం సెక్షన్లు జోడించాల్సి ఉంటుందని, ఆ సమాచారాన్ని మైనింగ్ శాఖకు తెలియజేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా క్వార్ట్జ్‌ను తవ్వేసినట్లు నిర్ధారణ అయినప్పటికీ ఒక్క కేసు కూడా పెట్టని రెవెన్యూ అధికారులు.. ఈ జోగుపల్లిలో పట్టా భూమిలో తవ్వకాలు జరుపుతుంటే ఎందుకు అంత ఉత్సాహం చూపారన్నదే అనేక అనుమానాలకు తావిస్తోంది. కానీ తహసీల్దార్ మాత్రం తామెటువంటి ఫిర్యాదు చేయలేదని చెప్పడం గమనార్హం. మరి ఫిర్యాదు లేకుండానే పోలీసులు కేసు నమోదు చేశారా..? అన్నది తేలాల్సి ఉంది. అయితే ఈ మొత్తం వ్యవహారం వెనుక ఓ అమాత్యుడు చక్రం తిప్పినట్లు అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

అక్రమ తవ్వకాలను అడ్డుకున్నది మైనింగ్ శాఖ.. అక్రమార్కులకు పెనాల్టీలు విధించిందీ ఆ శాఖ అధికారులే.. ఆ పెనాల్టీలు వసూళ్ల బాధ్యత కూడా వారిదే! అప్పటివరకూ వారు పట్టుకున్న వాహనాలను కస్టడీలో ఉంచుకోవాల్సిన బాధ్యత పోలీసులది. సదరు శాఖకు తెలియకుండా ఆ వాహనాల జోలికి వెళ్లే అధికారం పోలీసులకు లేదు.

కానీ..

రెవెన్యూ శాఖ ఈ వ్యవహారంలో తలదూర్చింది. సదరు వాహనాలపై రెవెన్యూ అధికారులు కేసు పెట్టారు. మైనింగ్ అధికారులకు తెలియకుండా పోలీసులు కేసు నమోదు చేసేశారు. ఆ వెంటనే స్థానిక కోర్టులో ఈ వాహనాలను ప్రవేశపెట్టడం.. కోర్టు ఆదేశాలతో ఆ వాహనాలను విడుదల చేయడం జరిగిపోయాయి. అసలు మైనింగ్ వ్యవహారంలో అది కూడా పట్టా భూమి వివాదంలో రెవెన్యూ అధికారులు ఎందుకు తలదూర్చారు.. మైనింగ్ అధికారులకు చెప్పకుండా పోలీసులు ఎందుకు కేసు నమోదు చేశారు. పెనాల్టీ చెల్లించకుండా వాహనాలను విడుదల చేశారంటే అసలు ఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు? ఇలా సవాలక్ష ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో ఇప్పుడు ప్రభుత్వానికి రావాల్సిన రూ.1.50 కోట్ల పెనాల్టీని ఎవరు వసూలు చేస్తారన్నదే అసలు ప్రశ్న. సైదాపురం మండలంలో జరిగిన ఈ వ్యవహారం ఇప్పుడు అధికార వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

మేము సేఫ్ కస్టడీకి అప్పగించాం

సైదాపురం మండలం జోగుపల్లి వద్ద పట్టా భూముల్లో అనుమతుల్లేకుండా క్వార్ట్జ్‌ను తవ్వారు. ఈ తవ్వకాలపై దాడులు చేసి ఐదు వాహనాలను పట్టుకున్నాం. పెనాల్టీలు కట్టేవరకు ఆ వాహనాలను సేఫ్ కస్టడీలో ఉంచాలని స్థానిక పోలీసులకు అప్పగించాం. కానీ ఆ తర్వాత ఏం జరిగిందో మాకు తెలియదు.

- శ్రీనివాసకుమార్, మైనింగ్ డీడీ

ఎటువంటి కేసు పెట్టలేదు

మేమంతా ఎన్నికల విధుల్లో ఉన్నాం. క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు, రవాణాపై ఎటువంటి కేసులు పెట్టలేదు. జోగుపల్లిలో పట్టుకున్న వాహనాలకు సంబంధించి కలెక్టర్ ఆదేశాలతో పెనాల్టీలు విధించినట్లు తెలిసింది.

- ప్రవీణ్‌కుమార్, సైదాపురం తహసీల్దార్

రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేశారు

జోగుపల్లిలో అనధికారికంగా క్వార్ట్జ్‌ను తరలిస్తున్న వాహనాలను మైనింగ్ అధికారులు మాకు అప్పగించారు. దీనిపై రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశాం. ఈ కేసును కోర్టుకు తీసుకెళ్లాం. కోర్టు ఆదేశాలతోనే వాహనాలను విడుదల చేశాం.

- విజయ్‌కుమార్, సైదాపురం ఎస్‌ఐ



మైన్స్‌లో తనిఖీలు చేస్తున్న మైనింగ్ శాఖ అధికారులు

మైన్స్‌లో కొనసాగుతున్న దాడులు

నెల్లూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : సైదాపురం మండలంలోని క్వార్ట్జ్ మైన్స్‌లో మైనింగ్ అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. ఇన్నాళ్లూ యథేచ్ఛగా అనుమతులు లేకుండా క్వార్ట్జ్ తవ్వకాల బాగోతం ఈ దాడులతో బట్టబయలవుతోంది. గురువారం కొన్ని మైన్స్‌లో దాడులు చేయగా శుక్రవారం ఇంకొన్ని మైన్స్‌లో తనిఖీలు చేశారు. గురువారం తుమ్మలతలుపూరు గ్రామంలోని రెండు పెద్ద మైన్స్‌పై దాడులు చేసి ఐదు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలానే ఆ మైన్స్‌లో జరిగిన తవ్వకాల లెక్కలను కొలతల ద్వారా సేకరించారు. శుక్రవారం తూర్పుపూండ్ల గ్రామంలోని మరో రెండు పెద్ద మైన్స్‌లో దాడులు చేసి మరికొన్ని వాహనాలను పట్టుకున్నారు. ఇక్కడా అక్రమంగా తవ్విన లెక్కలు తేల్చేందుకు కొలతలు తీశారు. పట్టుకున్న వాహనాలను సైదాపురం పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. మైనింగ్ శాఖ డీడీ శ్రీనివాసకుమార్ ఆధ్వర్యంలో మైనింగ్ జియాలజిస్టులు, ఇతర సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.





రెండేళ్లుగా సరెండర్ లీవ్ బిల్లుల పెండింగ్

రూ.500 కోట్ల వరకు ఆగిన చెల్లింపులు

వేతనజీవుల ఎదురుచూపులు

ఇంకెప్పుడిస్తారు!?

నెల్లూరు (హరనాథపురం), మే 17 : తమది ఉద్యోగుల పక్షమేనంటూ ఊదరగొడుతున్న వైసీపీ ప్రభుత్వం ఏళ్ల తరబడి వేతనజీవులు దాచుకున్న సరెండర్ లీవ్ బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తోంది. బిల్లుల చెల్లింపులు అటుంచితే, ప్రతినెలా ఒకటవ తేదీనైనా జీతాలు చెల్లించాలని పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు ఠంచనుగా 1వ తేదీకల్లా జీతాలు అందుకునే వేతనజీవులు ప్రస్తుత ప్రభుత్వంలో నెల ఆరంభమై రెండువారాలు గడిచినా ఖాతాల్లో డబ్బులు పడటం లేదు. దీనికితోడు తమ డిమాండ్ల సాధన కోసం పోరాటం చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులపై వైసీపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. దీంతో జీతాలైనా సకాలంలో చెల్లించండి మహాప్రభో అనే స్థాయికి చేరుకున్నారు. తాము దాచుకున్న సరెండర్ లీవ్ బిల్లులైనా చెల్లించాలని తీవ్రవత్తిడి తేవటంతో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన రెండేళ్లకు అంటే 2021, 2022 సంవత్సరాల్లో మాత్రమే చెల్లింపులు జరిగాయి. ఆ తర్వాత మళ్లీ ఫుల్‌స్టాప్ పెట్టింది.

● రెండేళ్లుగా పెండింగ్

ప్రతి ఉద్యోగికి సరెండర్ లీవ్ సంవత్సరానికి నెల రోజులు ఇస్తారు. ఉపాధ్యాయులకైతే సంవత్సరానికి 6 రోజుల సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్ చేసుకొనే అవకాశం ఉంటుంది. ఈ లీవ్‌కు సంబంధించిన నెల రోజుల మొత్తాన్ని ఉద్యోగులు అమ్ముకొంటుంటారు. చాలా మంది ఉద్యోగులు అవసరాలకు ఉపయోగ పడతాయని 2, 3 ఏళ్ల వరకు సరెండర్ లీవ్‌లను ఎత్తి పెట్టుకొని ఎన్‌క్యాష్ చేసుకొంటుంటారు. ఉదాహరణకు ఇక ఉద్యోగికి నెలకు రూ.లక్ష జీతం వస్తుందనుకొంటే రెండేళ్లపాటు ఆయన దాచిన సెలవులను అమ్ముకొంటే రూ.2లక్షలు పొందే వీలు ఉంటుంది. అవసరాల నిమిత్తం చాలా మంది ఉద్యోగులు తమ సరెండర్ లీవ్‌ను ఎన్‌క్యాష్ చేసుకోవడానికి బిల్లులు ట్రెజరీకి సమర్పించారు. అయితే, ఈ బిల్లులు రెండేళ్ల నుంచి చెల్లింపులకు నోచుకోలేదు. సుమారు రూ.500 కోట్ల వరకు ఉద్యోగులకు చెల్లించాల్సి ఉన్నట్టు సమాచారం.



శేష వాహనంపై వేదగిరీశుడి వైభోగం

నెల్లూరురూరల్, మే 17 : వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు శేషవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఆలయంలోని ప్రత్యేక మందిరంలో స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. అనంతరం శోభాయమానంగా అలంకరించిన శేషవాహనంపై శ్రీవారు అధిరోహించి ఆలయ పురవీధుల్లో ఊరేగారు. ఈ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించేందుకు భక్తులు వేదగిరికి తరలివచ్చారు. కాగ ఉదయం ఆలయం వద్ద ధ్వజారోహణ కార్యక్రమాన్ని అర్చకులు వేడుకగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ ఈ వేడుక కన్నుల పండువ గా సాగింది. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో గిరికృష్ణ పర్యవేక్షించారు.



ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

ఓట్ల లెక్కింపునకు సిద్ధం కండి!

● ఆర్‌ఓల సమీక్షలో కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), మే 17 : ఓట్ల లెక్కింపునకు అన్నివిధాలా సన్నద్ధం కావాలని కలెక్టర్ హరినారాయణ్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రిటర్నింగ్, నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఈ నెల 28 లోగా కౌంటింగ్ ఏజెంట్ల పేర్లను రాజకీయ పార్టీల ప్రతినిధులు రిటర్నింగ్ అధికారులకు అందజేయాలని సూచించారు. ఎన్నికల అనంతరం ఎలాంటి సంఘటనలు జరగకుండా పలుచోట్ల పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

● పోస్టల్ బ్యాలెట్లకు సీల్

నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టరేట్ స్ట్రాంగ్ రూములో ఉంచి సీల్ వేశారు. శుక్రవారం పోస్టల్‌లో వచ్చిన పోస్టల్ బ్యాలెట్ కవర్‌ను సిబ్బంది కలెక్టరేట్‌లో కలెక్టర్ హరినారాయణన్‌కు అందచేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వాటిని కలెక్టరేట్ స్ట్రాంగ్ రూంలో ఉంచి సీల్ వేశారు. ఆ ప్రతినిధులు సీల్‌పై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌ఓ బాపిరెడ్డి, రాజకీయ ప్రతినిధులు పాల్గొన్నారు.



పోస్టల్ బ్యాలెట్ పెట్టెకు సీల్ వేసి స్ట్రాంగ్ రూముకు తరలిస్తున్న సిబ్బంది



లారీలో అక్రమంగా తరలిస్తున్న జామాయిల్ కర్ర

అగ్రిగోల్డ్ భూముల్లో

చోర్.. చోర్!

- తరిగిపోతున్న జామాయిల్ చెట్లు
- రాత్రికి రాత్రే తెగనరికి అమ్ముకుంటున్న అక్రమార్కులు
- తెరవెనుక అధికార పార్టీ నేతల హస్తం

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), మే 17 : అగ్రిగోల్డ్ భూముల్లో సాగు చేసిన జామాయిల్‌పై అక్రమార్కుల కన్నుపడింది. గుట్టుచప్పుడు కాకుండా చెట్లను తెగనరికి దుంగలను రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. దుత్తలూరు మండలంలోని తురకపల్లి, రాచవారిపల్లి గ్రామాల సమీపాల్లో సుమారు 400 ఎకరాల్లో అగ్రిగోల్డ్ భూములు ఉన్నాయి. వాటిలో గతంలో జామాయిల్ సాగు చేశారు. అయితే వాటి గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో చుట్టుపక్కల గ్రామాల్లోని అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకుల కన్ను జామాయిల్ చెట్లపై పడింది. ఇంకేముంది.. రాత్రికి రాత్రే వాటిని నరికి రవాణా చేస్తూ రూ.లక్షల్లో సంపాదించారు. గతంలో ఒకటీ రెండు సార్లు అటవీ అధికారులు దాడులు చేసినా అక్రమార్కులు పెడచెవిన పెట్టారు. గత నెలలో జామాయిల్ అక్రమంగా నరికి తరలిస్తున్నారని గ్రామస్థులకు తెలియడంతో వారివెళ్లి నిలదీయడంతో అక్రమార్కులు లారీతో సహా పరారయ్యారు. తెర వెనుక అధికార పార్టీకి చెందిన నాయకులే ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే సుమారు రూ.80 లక్షల విలువ చేసే కలప రవాణా చేశారని స్థానికులు అంటున్నారు.



అగ్రిగోల్డ్ భూముల్లో నరికిన జామాయిల్

● కేసుల నమోదు

తురకపల్లి, రాచవారిపల్లి గ్రామాల్లోని అగ్రిగోల్డ్ జామాయిల్ తోటలను ఇటీవల సీఐటీ అధికారులు పరిశీలించారు. అక్రమంగా కలప నరికి రవాణాకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం. గతంలో వరికుంటపాడు మండలంలో సైతం అగ్రిగోల్డ్ భూముల్లో అక్రమంగా జామాయిల్ నరికి తరలిస్తుంటే పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గట్టి చర్యలు చేపట్టి అగ్రిగోల్డ్ ఆస్తులు కాపాడాలని పలువురు కోరుతున్నారు.

కేసులు నమోదు చేస్తాం

అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ చెట్ల నరికివేతపై ఇదివరకే మేము వెళ్లి పరిశీలించాము. ఉన్నతాధికారులకు నివేదిక కూడా ఇచ్చాము. అయితే, ఎన్నికల దృష్ట్యా కేసు నమోదు చేయాలేదు. మళ్లీ క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి, కలపను అక్రమ రవాణా చేసిన వారిపై కేసులు నమోదు చేస్తాము.

- ఆజాద్, సీఐడీ ఎస్‌ఐ

పోలీసు సిబ్బంది సంక్షేమానికి కృషి : ఎస్పీ



సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్

నెల్లూరు(క్రైం), మే 17: విధి నిర్వహణలో నిమగ్నమై ఉండే పోలీసు సిబ్బంది సంక్షేమానికి నిత్యం కృషి చేస్తామని జిల్లా ఎస్పీ కే ఆరీఫ్ హాఫీజ్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించారు. సిబ్బంది నుంచి ఎస్పీ స్వయంగా అర్జీలు స్వీకరించి వారితో ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలు పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న పనులను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డీపీవో అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని, అనధికారికంగా గైర్హాజరు అవుతూ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న మినీ వ్యాన్

వెంకటాచలం, మే 17 : మండలంలోని తాటిపర్తిపాళెం సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై శుక్రవారం బ్రాయిలర్ కోళ్ల లోడుతో వెళ్తున్న మినీ వ్యాన్ ట్రాక్టర్‌ను ఢీకొంది. వివరాల మేరకు సర్వేపల్లి వైపు వెళ్తున్న మినీ వ్యాన్ ప్రమాదవశాత్తు ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మినీ వ్యాన్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మినీ వ్యాన్ ముందు భాగం బాగా దెబ్బతింది. అంతేకాకుండా కొన్ని కోళ్లు మృతి చెందాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

365 గ్రాముల బంగారు ఆభరణాల చోరీ

నెల్లూరు(క్రైం), మే 17: ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గుర్తించిన గుర్తుతెలియని దుండగలు తాళం పగులగొట్టి బంగారు ఆభరణాల చోరీకి పాల్పడిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నగరంలోని అరవిందనగర్ ఎక్స్‌టెన్షన్ ఏరియాలో మధుసూదనరావు, శ్రీవల్లి దంపతులు నివాసం ఉంటున్నారు. శ్రీవల్లి తన కుటుంబంతో కలిసి ఈ నెల 15వ తేదీన అల్లూరులోని అత్తింటికి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగలు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రూ.14.24 లక్షల విలువ చేసే 365 గ్రాముల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. 16వ తేది ఇంటికి వచ్చిన బాధితురాలు తలుపులు తెరిచి ఉండటాన్ని గుర్తించి లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని నగలు కనిపించలేదు. దీంతో బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎల్ వీరానాయక్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. సంఘటన స్థలంలో క్లూస్ టీమ్ వేలిముద్రలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లీకూతుళ్లపై కత్తితో దాడి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాంతమ్మ

వింజమూరు, మే 17 : తల్లీకూతుళ్లపై ఓ యువకుడు కత్తితో విచక్షణారహితంగా దాడి చేయడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. వింజమూరులోని వైశ్యబజారులో శుక్రవారం ఉదయం జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేగింది. వివరాల్లోకి వెళితే.. సంక్రాంతి కాంతమ్మ దినసరి కూలిపనులు చేస్తూ తన కుమార్తె పూజితను చదివిస్తోంది. అయితే, శుక్రవారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో వంటేరు నాగరాజు అనే యువకుడు ఇంట్లో ఉన్న తల్లీకూతురిపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఆ తర్వాత ఇంట్లో నుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన కాంతమ్మ, పూజితలు ఇంటిలో నుంచి బయటకు వచ్చి పడిపోవడంతో స్థానికులు గమనించి స్థానిక ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ ఫిరోజ్, ఎస్ఐ కోటిరెడ్డిలు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆసుపత్రిలో పొందుతున్న బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపినట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు. నాగరాజు వ్యవహారంపై గతంలో కూడా ఫిర్యాదు అందిందని, ఏదిఏమైనా నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు స్పష్టం చేశారు.

ఇంట్లో దీపం వొలికి అగ్ని ప్రమాదం

నెల్లూరు(క్రైం), మే 17: ఇంట్లో దీపారాధన చేసి ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లగా దీపం వొలికి పడి మంటలు చెలరేగిన ఘటన శుక్రవారం చంద్రమౌళినగర్‌లోని నాల్గోవీధిలో జరిగింది. అగ్నిమాపక సిబ్బంది సమాచారం మేరకు.. నగరంలోని చంద్రమౌళినగర్ 4వ వీధిలో ఉన్న ఓ రేకుల ఇంట్లో ఇంద్రాణి కుటుంబం అద్దెకు ఉంటోంది. ఆమె శుక్రవారం దీపారాధన చేసి ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. ఈ క్రమంలో దీపం వొలికి కింద పడటంతో పక్కనే ఉన్న దుస్తులకు మంటలు అంటుకున్నాయి. ప్రమాదఘటపై స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అయితే అప్పటికే ఇంట్లోని వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షలు మేరా ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

జెన్‌కో థర్మల్ కేంద్రం బూడిద పైపులైన్ లీకేజీ



లీకేజీ అవుతున్న బూడిద పైప్‌లైన్

ముత్తుకూరు, మే 17 : నేలటూరులోని శ్రీదామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి యాష్ పాండ్‌కి వెళ్లే పైపులైన్ శుక్రవారం లీకైంది. దాంతో పైపు నుంచి ఉప్పు నీరు, బూడిద వేగంగా చిమ్మడంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. ఈ విషయమై ప్లాంటు అధికారులకు సమాచారం అందజేసినా ప్లాంట్ ఆపకపోవడంతో ఉప్పు నీరు, బూడిద సమీపంలోని రొయ్యల చెరువులోకి చేరింది. దీంతో రొయ్యల చెరువులో ఉన్న రొయ్యలు చనిపోయాయని, సుమారు రూ.12లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. తనకు జరిగిన నష్టానికి జెన్‌కో అధికారులు న్యాయం చేయకపోతే ఆత్మహత్య తప్ప వేరే మార్గం లేదని రైతు దశయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. జరిగిన లీకేజీ పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్నామని, రైతుకు జరిగిన నష్టాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని యాష్ పాండ్ ఎస్ఈ అరుణ్‌కుమార్ తెలిపారు.

పోలేరమ్మ ఆలయంలో చోరీ

కావలి రూరల్, మే 17: కావలి మండలం నారాయణపురం పోలేరమ్మ ఆలయంలో చోరీ జరిగినట్లు శుక్రవారం ఆలయ పూజారి కమతం గోవర్ధన్ గుర్తించి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామస్థుల వివరాల మేరకు.. గురువారం రాత్రి గ్రామానికి సమీపంలో ఉన్న ఆలయం గ్రిల్ తాళాలు పగలగొట్టి గుర్తు తెలియని దుండగులు ఆలయంలోకి ప్రవేశించినట్లు తెలిపారు. ఆలయంలోని అమ్మవారి విగ్రహం పక్కన ఉన్న బీరువా పగులగొట్టి అందులోని అమ్మవారి చీరలతో పాటు హుండీలోని సుమారు రూ.2వేల నగదు, ఇత్తడి గంగాళాలు తీసుకు వెళ్లినట్లు తెలిపారు. చోరీకి గురైన సొత్తు విలువ రూ.6వేలు ఉంటుందని ఆలయ పూజారి, గ్రామస్థులు పేర్కొన్నారు.



ఆలయంలో అమ్మవారి విగ్రహం పక్కన బీరువా పడేసిన దొంగలు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	172
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	300
స్కిన్‌లెస్	330
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6972
వెండి కిలో ధర	రూ. 88,800
వెండి ఒక గ్రాము	రూ. 90.80



ఇంటర్ పరీక్షలు ముగిసాయి.. తర్వాత ఏం చదవాలి, ఏ రంగంలో స్థిరపడాలనే సందేహాలు విద్యార్థుల మొదళ్లను తొలిచేస్తుంటాయి. డాక్టర్, ఇంజనీర్, శాస్త్రవేత్త, బ్యాంక్ ఉద్యోగి, చార్టర్డ్ అకౌంటెంట్, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు.. ఇలా ఎన్నో అవకాశాలు ఊరిస్తుంటాయి. కానీ ఇది సరైన సమయం కాదు.. తల్లిదండ్రులు, స్నేహితుల ఒత్తిడి మేరకు నిర్ణయం తీసుకోకుండా మీ కిష్టమైన కోర్సును ఎంపిక చేసుకుని ముందుకు సాగితే భవిష్యత్ ఆనందమయంగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

- నెల్లూరు (విద్య)

ఇంటర్ తర్వాత...?

• కోర్సుల ఎంపికే కీలకం • భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి

విద్యార్థులకు సూచనలు

- ప్రతి విద్యార్థికి ఏదో ఒక అభిరుచి ఉంటుంది. ఇప్పుడే దానిని గుర్తించాలి. సామర్థ్యం ఉన్న సబ్జెక్ట్‌ను ఎంచుకుని అందులో చేరాలి
- తల్లిదండ్రులు చెప్పారని, స్నేహితులు తీసుకున్నారని ఏ కోర్సులో పడితే దానిలో చేరవద్దు. మార్కెట్ డిమాండ్ కన్నా మనసుకు నచ్చిన కోర్సుకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- పట్టుదల ఉంటేనే చదువులో రాణించగలరు. ఇంజనీరింగ్ విద్య పూర్తిచేసిన ప్రతి వందమందిలో 60 మందిని స్కిల్స్ లేవని కంపెనీలు తిరస్కరిస్తున్నాయి. ఆ జాబితాలో మీరు లేకుండా చూసుకోండి.
- తల్లిదండ్రులు కూడా పిల్లలకు మార్గదర్శకం చేయాలి తప్ప దిశానిర్దేశం కాదు. పిల్లలకు ఇష్టమైన కోర్సుల్లో చేరనీయండి. అందులో రాణించేలా ప్రోత్సాహం అందించాలి. వారిపై ఒత్తిడి తెచ్చి ఇబ్బందులు పెట్టకూడదు. భవిష్యత్‌కు బాటలు వేసే ఎన్నో కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఆలోచించి నిర్ణయం తీసుకోండి.

వ్యవసాయం, ఉద్యానవనం

ఎంసెట్‌తోనే బీఎస్సీ అగ్రికల్చర్, ఆర్టికల్చర్ (బైపీసీ విద్యార్థులు) చదివే అవకాశం ఉంది. నాలుగేళ్ల బీఎస్సీ అగ్రికల్చర్, ఆపై పీజీ తర్వాత పరిశోధన వైపు అడుగులు వేసే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

సేవ చేయాలనుకుంటే..

బైపీసీ విద్యార్థులకు బీఎస్సీ నర్సింగ్ మరో చక్కని అవకాశం. ఈ కోర్సుతో స్వయం ఉపాధి పొందడమే కాకుండా రోగులకు సేవ చేసే అవకాశం ఉంటుంది. ఇంటర్ తర్వాత నాలుగేళ్ల కోర్సును ఎంపిక చేసుకుంటే ఆపై వెంటనే ఉద్యోగం వస్తుంది. రెండేళ్ల ఫిజియోథెరపీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి..

ఇంజనీరింగ్

ఎంసెట్‌లో ఇంజనీరింగ్ కోర్సులకు ప్రాధాన్యం అధికం. ఇందులో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఐటీ, ఈఈఈ వంటి కోర్సులు ఉన్నాయి. ఆసక్తి ఉంటే వీటిల్లో ఏదో ఒక కోర్సులో రాణించే అవకాశం ఉంటుంది.

వైద్య విద్య

వైద్యవృత్తిపై ఆసక్తి ఉంటే ఎంబీబీఎస్ కోర్సు ఉత్తమం. నీట్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా కౌన్సెలింగ్‌లో సీటు లభిస్తుంది. ఎంబీబీఎస్ పూర్తి చేసినవారు ఆసుపత్రుల్లో సివిల్ అసిస్టెంట్ సర్జరీ మెడికల్ ఆఫీసర్ వంటి ఉద్యోగాలు పొందవచ్చు. సొంతంగా ఆసుపత్రి కూడా పెట్టుకోవచ్చు. ఎంబీబీఎస్‌లో సీటు రాకపోతే బీడీఎస్‌లో సీటు పొంది భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చు.

సీఏతో విశ్వవ్యాప్త ఉపాధి

దేశ ఆర్థిక వ్యవహారాల్లో పర్యవేక్షణ నియంత్రణకు సీఏ కోర్సు ఎంతో దోహదం చేస్తుంది. ఇంటర్ తర్వాత సీపీటీ ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఇందులో అర్హత సాధించి ఐపీసీపీలో చేరవచ్చు. నాలుగున్నరేళ్ల శ్రద్ధగా చదివితే సమాజంలో ఉన్నత హోదాలో కొనసాగే అవకాశం ఉంటుంది.

ఫార్మసీకి ప్రాధాన్యం

ఔషధ రంగ పరిశోధన, అభివృద్ధి రంగాల్లో ఫార్మసీ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుంది. అవకాశాలు విస్తృతంగా ఉంటాయి. ఎంసెట్‌తోనే బీఫార్మసీ ప్రవేశాలు జరుగుతాయి. ఇది పూర్తిచేసిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ ఆఫీసర్, హాస్పిటల్ ఫార్మాసిస్టులుగా ఉద్యోగాలు లభిస్తాయి.

న్యాయవాద వృత్తి

ఇంటర్ తర్వాత ఐదేళ్ల న్యాయవిద్య కోర్సు ఉంటుంది. లాసెట్‌తో ప్రవేశాలు జరుగుతాయి. స్థిరపడేందుకు ఎక్కువ సమయం తీసుకున్నా ఉపాధికి ఏమాత్రం ఢోకా ఉండదు. న్యాయవాదిగా, వ్యాపార సంస్థల న్యాయ సలహాదారుగా రాణించే అవకాశం ఉంటుంది.

సంప్రదాయ డిగ్రీ

డిగ్రీ అంటే చిన్నచూపు వద్దు. శ్రద్ధతో చదివితే మంచి అవకాశాలు ఉన్నాయి. బీఏతో పాటు బీకాం జనరల్, కంప్యూటర్ కోర్సులకు మంచి డిమాండ్ ఉంది. బీఎస్సీలో అనేక కాంబినేషన్ కోర్సులు ఉన్నాయి. వీటిలో ఏదో ఒకటి ఎంచుకోవచ్చు. డిగ్రీ అనంతరం పీజీ పూర్తి చేసి గ్రూప్స్‌కు, సివిల్స్‌కు ప్రిపేర్ అవ్వొచ్చు.

డీఎడ్

ఉపాధ్యాయ వృత్తిపై మక్కువ ఉంటే రెండేళ్ల డీఎడ్ కోర్సులో చేరవచ్చు. జిల్లాలో ఇలాంటి కళాశాలలు ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలోనూ ఉన్నాయి. డీఎడ్ కామన్ ఎంట్రన్స్ పరీక్షతో సీటు లభిస్తుంది. నేడు ఉపాధ్యాయ వృత్తికి కూడా ఎంతో డిమాండ్ ఉంది..



నియమాలు పాటిస్తే రక్తపోటు నివారణ

• డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య • నగరంలో అవగాహన ర్యాలీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో, ఇతర అధికారులు

నెల్లూరు (వైద్యం), మే 17 : ఆరోగ్యకరమైన ఆహారం, కోపాన్ని తగ్గించుకోవడం, శారీరక శ్రమ, వ్యాయామం చేయడం ద్వారా రక్తపోటును నివారించుకోవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య వెల్లడించారు. శుక్రవారం ప్రపంచ రక్తపోటు నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నగరంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి బీఈడీ కళాశాల వరకు అవగాహన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగిన సమావేశంలో డాక్టర్ పెంచలయ్య మాట్లాడారు. ప్రతి మనిషి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆరోగ్యానికి హాని చేసే అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వల్లి మాట్లాడుతూ రక్తపోటు ఉన్నవారు తగిన జాగ్రత్తల ద్వారా నియంత్రించుకోవచ్చన్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ అధిక రక్తపోటును ముందుగానే గుర్తించడం చాలా ముఖ్యమన్నారు. దీనినే నిశ్శబ్ద కిల్లర్ అని పిలుస్తారని చెప్పారు. అధిక రక్తపోటు వల్ల గుండె, మెదడుకు సంబంధించిన వ్యాధులు, పక్షవాతం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా రక్తపోటు నియంత్రణపై పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గొడవలు చేస్తే ఉపేక్షించేది లేదు : సీఐ

• వైసీపీ, టీడీపీ నేతలతో వేర్వేరుగా సమావేశం



టీడీపీ నేతలతో మాట్లాడుతున్న ఒకటో పట్టణ సీఐ రాజేష్

కావలి, మే 17: వచ్చేనెల 4వ తేదీన జరిగే ఎన్నికల కౌంటింగ్ లోపు గాని కౌంటింగ్ రోజు కాని తర్వాత గాని ఎవరైనా గొడవలు సృష్టించినా, గొడవలకు పాల్పడినా, గొడవలను ప్రోత్సహించినా ఎంతటివారైనా సరే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కావలి ఒకటో పట్టణ సీఐ రాజేష్ తెలిపారు. పోలింగ్ అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న హింసా కాండను దృష్టిలో పెట్టుకుని ఎన్నికల కమిషన్ సీరియస్ అవుతుండటంతో పోలీస్ అధికారులు ముందస్తుగా అప్రమత్తమయ్యారు. ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం టీడీపీ, వైసీపీ ముఖ్య నాయకులతో సీఐ రాజేష్ విడివిడిగా సమావేశాలు నిర్వహించి ఎవరూ గొడవలకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ఆయా పార్టీల నేతలు వారి అనుచరులు సహకరించాలన్నారు. గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కౌంటింగ్ అనంతరం విజయోత్సవాలు జరుపుకోవాలన్నా, ర్యాలీలు నిర్వహించాలన్నా మోడల్ కోడ్‌ఆఫ్ కాంటాక్ట్ నిబంధనల మేరకు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. కావలి పట్టణంలో శాంతిభద్రతలు అదుపులో ఉంచేందుకుగాను ఉన్నతాధికారులు ముందుగానే 20 మంది స్పెషల్ పార్టీ వారిని కావలికి పంపించి ఉన్నారన్నారు. ఒకటో పట్టణ పరిధిలో మానస హాల్ సెంటర్, పాతూరు కృష్ణుడిబొమ్మ సెంటర్, తుమ్మలపెంట రోడ్డులోని జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానం సెంటర్‌లలో పోలీస్ పికెటింగ్‌లు ఏర్పాటు చేసి ఇద్దరు ఎస్‌లతో నిరంతరం గస్తీ నిర్వహించటం జరుగుతోందన్నారు.

కనుల పండువగా

త్రిపురాసుర అలంకారం



మూలస్థానేశ్వరాలయంలో త్రిపురాసుర అలంకారం

నెల్లూరు(సాంస్కృతికం), మే 17 : నగరంలోని మూలా పేట మూలస్థానేశ్వరాలయంలో లోక కల్యాణార్థం జరుగుతున్న వసంతోత్సవాలు శుక్రవారం 6వ రోజుకి చేరాయి. ఈ సందర్భంగా ఉదయం మహాన్యాస పూర్వక రుద్రా భిషేకాలు, ప్రత్యేక పూజలు, పూలంగిసేవ జరిగాయి. భువనేశ్వరి అమ్మవారికి ప్రత్యేక అలంకారం, పూజలు నిర్వహించారు. రాత్రి త్రిపురాసుర అలంకారం కనుల పండువగా జరిగింది. భక్తులతో ప్రాకారోత్సవం నిర్వహించి తోటల్లో స్వామికి కుంభహారతులు వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను ధర్మకర్తలు, ఉభయకర్తలు, ఈవో వేణుగోపాల్, సిబ్బంది పర్యవేక్షించారు.



వైభవంగా కన్యకాపరమేశ్వరి జయంతి

నెల్లూరు(సాంస్కృతికం), మే 17 : నగరంలోని స్టోన్‌హౌస్‌పేట వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు శుక్రవారం 9వ రోజుకి చేరాయి. ఈ సందర్భంగా ఆలయం అర్చకులు లలిత శివకుమార్‌స్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. శ్రీపీఠం భక్తిమండలి వారిచే సామూహిక లలిత సహస్ర నామ పారాయణం జరిగింది. సాయంత్రం విశేష పూజలు అనంతరం అమ్మవారికి గజవాహనంపై ప్రాకారోత్సవం జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమాలను ధర్మకర్తలు, ఉభయకర్తలు పర్యవేక్షించారు.

సోమశిలలో 7.766 టీఎంసీల నీటి నిల్వ

అనంతసాగరం, మే 17: సోమశిల పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారం నాటికి జలాశయంలో 7.766 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువకు 10 క్యూసెక్కులు నీరు సరఫరా చేస్తున్నారు.

యువకుడిపై దాడి

బుచ్చిరెడ్డిపాళెం, మే 17: స్థానిక శాంతినగర్‌లో గడ్డం కుమార్ అనే యువకుడిపై అదే ప్రాంతానికి చెందిన నలుగురు యువకులు దాడిచేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. క్రికెట్ ఆడుతుండగా వారిమధ్య జరిగిన వివాదం దాడికి దారితీసింది. బాధితుడు కుమార్ ఫిర్యాదు మేరకు ఆదిశేషు, రవితేజ, మోహన్, వంశీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బంగారు, వెండి నగలు చోరీ

బుచ్చిరెడ్డిపాళెం, మే17: స్థానిక బాంబేరోడ్డు ప్రధాన రహదారి సమీపంలో నివసించే కుంజుకూరు వేణుగోపాల్ ఇంట్లో 12 సవర్ల బంగారు నగలు, వెండి మార్చి నెలలో చోరీకి గురైనట్లు శుక్రవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువును తవ్వేస్తూ..

అక్రమంగా మట్టి అమ్మకం

ఏఎస్‌పేట, మే17: అధికారులు ఎన్నికల విధుల్లో ఉండగా ఇదే అదునుగా భావించిన కొందరు అక్రమంగా చెరువులో ఉన్న మట్టిని తీసుకెళ్లి సొమ్ము చేసుకుంటున్నారు. వివరాల మేరకు ఏఎస్‌పేట మండలం హసనాపురం గ్రామ చెరువులో కొన్ని రోజులుగా మట్టిని అక్రమంగా తవ్వేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా పట్టపగలే సుమారు 10 ట్రాక్టర్లను ఏర్పాటు చేసి తరలిస్తున్నారు. ట్రక్కు మట్టి రూ.500లు నుంచి రూ.800ల వరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. పోలింగ్‌కు రెండు రోజుల ముందు కూడా మట్టిని తరలించారు. పోలింగ్ అనంతరం మరలా శుక్రవారం నుంచి మట్టి తవ్వకాలు చేపట్టారు. ఇకనైనా అధికారులు స్పందించి అక్రమంగా జరుగుతున్న మట్టి తవ్వకాలను అడ్డుకొని చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



హసనాపురం చెరువులో ట్రాక్టర్‌కు మట్టి లోడ్ చేస్తున్న జేసీబీ

సెలవుల్లోనూ క్లాసులే!

'కార్పొరేట్' విద్యాసంస్థల్లో ప్రైవేటు తరగతులు

విద్యా శాఖ నిబంధనలు బేఖాతరు

నెల్లూరు (విద్య), మే 17 : సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించరాదన్న ప్రభుత్వ ఆదేశాలను ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు బేఖాతరు చేస్తున్నాయి. గడిచిన విద్యాసంవత్సరంలో ఒక్క సెలవు కూడా లేకుండా తరగతులు నిర్వహించిన కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రస్తుతం వేసవి సెలవుల్లోనూ తరగతులను నిర్వహిస్తున్నారు. ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులను తరగతి గదుల్లో బంధించేస్తున్నారని విద్యార్థి సంఘాలు భగ్గుమంటున్నాయి. ఓ వైపు కుటుంబసభ్యులు, మరోవైపు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకునే వారంతా సెలవుల్లో రిలాక్స్ అవుతుంటే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు మాత్రం విద్యార్థులను యంత్రాలుగా భావించి క్లాసు రూముల్లోనే బలవంతపు చదువులు రుద్దుతున్నారు. దీనిపై ఇప్పటికే పలు విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేస్తూ తరగతులు నిర్వహించరాదని అధికారులకు విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. విద్యాధికారులు కూడా తరగతులు నిర్వహించకూడదని జారీ చేస్తున్న ఆదేశాలన్నీ కాగితాలకే పరిమితం అవుతున్నాయి. దీంతో విద్యార్థి సంఘ నాయకులే విద్యాసంస్థల్లో తనిఖీలు చేస్తూ విద్యార్థులను తరగతి గదుల నుంచి బయటకు పంపిస్తున్నారు. మరోవైపు తల్లిదండ్రులు కూడా తప్పనిసరి పరిస్థితుల్లో పిల్లలను తరగతులకు పంపిస్తున్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలు ఇవేమీ పట్టించుకోకుండా సెలవులతో సంబంధం లేకుండా తరగతులు నిర్వహించడమే పనిగా పెట్టుకుని విమర్శలు మూటగట్టుకుంటున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలను కఠినంగా అమలు చేయాలని విద్యార్థి సంఘాలు, విద్యా ప్రముఖులు కోరుతున్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

రామస్వామిపాలెంలో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

చిట్రగుంట, మే 17: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నిత్యప్రశాంతి ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో వైద్యులు రోజ్‌లిన్, అమృత పలువురికి వైద్య పరీక్షలు చేశారు. బీపీ, షుగర్ తదితర వ్యాధులకు సంబంధించిన 151 మందికి ఉచిత మందులు అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు గండూరి మంజుల, కార్యదర్శి చైతన్య, సూపర్‌వైజర్లు విక్టోరియారాణి, క్రిష్ణమూర్తి, ఆరోగ్య సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఘనంగా సీతారాముల ఉత్సవం

ఉదయగిరి రూరల్ మే 17: మండలంలోని శునకానపల్లిలో మూడు రోజులుగా జరుగుతున్న శ్రీసీతారాముల ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. శుక్రవారం ఉత్సవ మూల విరాట్ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి వసంత మహోత్సవం, పారువేట నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనగా ఆలయకమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

నాడు-నేడు పనుల తనిఖీ

ఉదయగిరి రూరల్ మే 17: మండలంలోని మాసాయిపేట మెయిన్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న రెండో దశ నాడు నేడు పనులను శుక్రవారం ఎంఈవో1 షేక్ మస్తాన్‌వలీ పరిశీలించారు. టైల్స్, మురుగుదొడ్ల నిర్మాణం, డోర్ల ఏర్పాట్ల పనుల్లోని నాణ్యతను పరిశీలించారు. అలాగే ప్రహరీ నిర్మాణ విషయంలో నెలకొన్న వివాదాన్ని తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. చేసిన పనులకు వాటర్ క్యూరింగ్ బాగా చేయాలని, పాఠశాల ఆవరణంలో మొక్కలు పెంచేలా దృష్టి సారించాలని కోరారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

కావలి రూరల్, మే 17: కావలి పట్టణ వెక్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని అలవలపాటి సిరి ప్రియాంక అదృశ్యంపై ఆమె తల్లిదండ్రులు గురువారం రాత్రి 2వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. కొండాపురం మండలం కొమ్మి గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమార్తె సిరి ప్రియాంక పరీక్షలు రాయటానికి వెళ్తున్నట్లు చెప్పి కావలి వచ్చినట్లు తెలిపారు. కళాశాలలో పరిచయస్తుడైన విశాఖపట్నంకు చెందిన రవి అనే యువకుడితో సన్నిహితంగా ఉండటం ఇంట్లో తెలియడంతో కళాశాలకు పంపకుండా ఇంట్లోనే ఉంచినట్లు తెలిపారు. పరీక్షల నిమిత్తం కళాశాలకని చెప్పి వచ్చిన కుమార్తె అదృశ్యం కావడంపై రవిపై అనుమానం వ్యక్తం చేస్తూ విద్యార్థిని తల్లి మాలతి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

13 మందిపై అట్రాసిటీ కేసు

ఉలవపాడు, మే 17: మండలంలోని కరేడులో రెండు సామాజిక వర్గాల మధ్య విభేదాలు కొట్లాటకు దారితీసిన సంఘటనలో 13మందిపై పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్సై బాజీరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 14వ తేదీ సాయంత్రం కరేడు ఎస్సీ కాలనీకి చెందిన యువకులు కాలనీకి ఆనుకొని ఉన్న మరో సామాజిక వర్గం బజారులో వెళ్తుండగా కులం పేరుతో దూషించి మా వీధిలోకి రావద్దని వాదనకు దిగారని, దీంతో వివాదం చెలరేగి ఇరు సామాజిక వర్గాలు కొట్లాటకు దిగారు. ఇందులో గాయాలకు గురైన ఇరువర్గాల వారు ఒంగోలు రిమ్స్‌లో, కందుకూరు ఏరియా ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకున్నారు. కాగా, గురువారం రాత్రి ఆసుపత్రి వర్గాల నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేజాలిరెడ్డి, సోమశేఖర్, రాఘవరెడ్డితోపాటు మొత్తం 13 మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేయగా, మహిళలను దూషించి భౌతిక దాడి చేసినందుకు ఎస్సీ యువకులు వెంకట నరసింహ, కల్యాణ్, శ్రీకాంత్, మనోజ్, సాయిలపై కొట్లాట కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కేజీవీల్స్‌తో రహదారుల ధ్వంసం



దెబ్బతిన్న అన్నారెడ్డిపాళెం అరవపాళెం రహదారి

సంగం, మే 17: మండలంలోని అన్నారెడ్డిపాళెం - అరవపాళెం రహదారి కేజీవీల్స్‌తో అధ్వానంగా తయారైంది. రైతులు పొలాల్లో బురద దుక్కులు దున్నుకునేటప్పుడు ట్రైర్లకు కేజీవీల్స్ తగిలించి దుక్కులు చేస్తారు. అయితే కేజీవీల్స్‌తో ఒక చోట నుంచి మరోచోటకు వెళ్లేటప్పుడు కేజివిల్స్ తగిలించి తారు రహదారిపై తిరగడంతో ధ్వంసమవుతున్నాయి. అన్నారెడ్డిపాళెం - అరవపాళెం తారు రోడ్డుపై కేజీవీల్స్‌తో తిప్పడంతో అధ్వానంగా తయారైందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కేజీవీల్స్‌లు నడపకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



మృతి చెందిన గేదె

ఏఎస్‌పేట, మే 17: విద్యుత్ షాక్‌కు గురై గేదె మృతి చెందిన సంఘటన శుక్రవారం ఏఎస్ పేట మండలం చౌటభీమవరంలో చోటు చేసుకుంది. వివరాల మేరకు చౌటభీమవరం గ్రామంలో తాగునీటి మోటరు స్టార్టర్ ఏర్పాటు చేసిన స్తంభం వద్ద కొన్ని రోజులుగా ఎర్త్ వస్తోంది. ఈ విషయం విద్యుత్ అధికారులకు తెలిపినా పట్టించుకోకపోవడంతో స్తంభం వద్దకు ఎవరూ వెళ్లకుండా పలువురు స్తంభం చుట్టూ కంపను ఏర్పాటు చేశారు. గురువారం కురిసిన వర్షానికి స్తంభం చుట్టు నీరు చేరింది. శుక్రవారం గ్రామానికి చెందిన కే. హజరత్తయ్య అనే రైతు గేదె మేతకు వెళ్లి వస్తూ స్తంభం వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో గేదె విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం

వింజమూరు, మే 17 : పట్టణంలోని విరాట్‌నగర్‌లో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి గుడిలో శుక్రవారం స్వామి వారి ఆరాధన సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉప్పుటేరు లో లెవల్ వంతెనతో ప్రజల అవస్థలు

● ఓ మోస్తరు వర్షానికే వంతెనపై వరద నీరు ● గ్రామాల రాకపోకలకు ఆటంకం ● హైలెవల్ వంతెన నిర్మించాలని ప్రజల మొర



పెదపవనిలో ఉప్పుటేరుపై నిర్మించిన లోలెవల్ వంతెన

లింగసముద్రం, మే 17 : మండలంలోని చినపవని-పెదపవని గ్రామాల మధ్యన ఉప్పుటేరుపై నిర్మించిన లో లెవల్ వంతెనతో ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సుమారు 25 సంవత్సరాల క్రితం కందుకూరు-పెదపవని గ్రామాల మధ్యన ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నిర్మించిన ఈ లోలెవల్ వంతెనపై నుంచి కొద్దిపాటి వర్షానికే వరద నీరు ప్రవహిస్తోంది. ముఖ్యంగా వర్షాకాలం సమయంలో భారీ వర్షాలు కురిసినప్పుడు ఈ లోలెవల్ వంతెనపై నుంచి సుమారు ఐదారు అడుగుల ఎత్తున వరద నీరు ప్రవహించి వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. అంతేగాక ఈ సమయంలో పెదపవని గ్రామానికి మండలంలోని మిగతా గ్రామాలకు సంబంధాలు పూర్తిగా బంద్ అవుతాయి. అంతేగాక ఇటు లింగసముద్రం మండలం నుంచి, అటు వైపు కావలి పట్టణం నుంచి బస్సులు, లారీలు ఇతర వాహనాల రాకపోకలు నిలిచి పోతాయి. ఈవిధంగా రెండు మూడు రోజుల పాటు వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుంది. మండలంలోని లింగసముద్రం, అన్నెబోయినపల్లి, వీఆర్ కోట, చినపవని తదితర గ్రామాల ప్రజలు ఈ వంతెన మీదుగానే కావలి, నెల్లూరు, చెన్నై వంటి ప్రాంతాలకు వైద్యశాలలకు, ఇతర పనులపై వెళుతుంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డుపై హైలెవల్ వంతెన నిర్మించాల్సిన అవసరం ఉంది.

2021లో వరదలకు ఇద్దరు దుర్మరణం

2021వ సంవత్సరంలో కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదలకు ఈ వంతెనపై నుంచి సుమారు ఐదారు అడుగుల ఎత్తున వరద నీరు ప్రవహించింది. ఈ వరద నీటి ప్రవాహాన్ని ఆటోలో దాటి కావలికి వెళ్లేందుకు ప్రయత్నించిన మండలంలోని మొగిలిచెర్ల గ్రామానికి చెందిన ఇద్దరు ఎస్సీ యువకులు ఆటోతో సహా కొట్టుకొని పోయి దుర్మరణం పాలయ్యారు. అత్యంత ప్రమాదకరంగా ఉన్న ఈ లోలెవల్ వంతెనను హైలెవల్ వంతెనగా మార్చి వరద ప్రమాదాల నుంచి వాహనదారులను, ప్రయాణికులను కాపాడాలని ప్రజలు, కోరుతున్నారు.

ఆత్మకూరు నుంచి అరుణాచలంకు ప్రత్యేక బస్సు

ఆత్మకూరు, మే 17 : బుద్ధపౌర్ణమి సందర్భంగా ఈ నెల 23న ఆత్మకూరు నుంచి అరుణాచలంకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సర్వీస్ ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం కరీమున్నిసా తెలిపారు. ఈ నెల 22వ తేది ఉదయం 8 గంటలకు ఆత్మకూరు నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు.

యువనేస్తం ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న యువనేస్తం సేవా ఫౌండేషన్ సభ్యులు

సంగం, మే 17: మండలంలోని సిద్ధీపురంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతి రుయా వైద్యశాలలో చికిత్స పొందుతున్న షేక్ జిలానికి యువనేస్తం సేవా ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. యువనేస్తం సేవా ఫౌండేషన్ సభ్యులు నాయబ్ రసూల్, పరంధామయ్య, అన్వేష్‌రెడ్డి, రామిరెడ్డి ధనుంజయ్, వారి మిత్ర బృందం, గ్రామస్తుల సహకారంతో బాధిత కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 75వేలు ఆర్థిక సాయం అందజేశారు.

కావ్య క్రిష్ణారెడ్డి విజయం ఖాయం

● ఆర్యవైశ్య నేతల అభినందనలు



కావ్య క్రిష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందచేస్తున్న ఆర్యవైశ్య నేతలు

కావలి, మే 17: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి విజయం ఖాయం అని ఆర్యవైశ్య నేతలు పేర్కొన్నారు. శుక్రవారం కావలి పట్టణం ముసునూరులోని ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. కావలి నియోజకవర్గంలో జరిగిన పోలింగ్ సరళిని పరిశీలించిన అనంతరం క్రిష్ణారెడ్డి గెలుపు తథ్యమని తెలిసిపోయిందన్నారు. జూన్ 4న జరుగనున్న ఓట్ల లెక్కింపులో మెజార్టీ తేలిపోతుందన్నారు. కావలి అభివృద్ధి చెందాలంటే క్రిష్ణారెడ్డి లాంటి నేత అవసరం ఎంతయినా ఉందన్నారు.

● బ్రహ్మంగారి ఆరాధనోత్సవంలో..

కావలి పట్టణ వెంగళరావు నగర్‌లోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం క్రిష్ణారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని భగవంతుని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు మొగిలి కల్లయ్య, నాయుడు రాంప్రసాద్, శానం హరి, బిట్రగుంట శివప్రసాద్, దేవరకొండ శ్రీనివాసులు, ఆలా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యమే జేవీవీ ధ్యేయం



మాట్లాడుతున్న డాక్టర్ బెజవాడ రవికుమార్

కావలిటౌన్, మే17: ప్రజలను చైతన్యవంతం చేయడమే జేవీవీ ధ్యేయం అని జిల్లా గౌరవాధ్యక్షుడు, రెడ్‌క్రాస్ కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం రవి నర్సింగ్ హోమ్‌లోని సమావేశ మందిరంలో జేవీవీ విస్తృత కార్యవర్గ సమా వేశం జరిగింది. జేవీవీ పట్టణ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ జనంలోని అజ్ఞానాన్ని పారదోలి వారిని విజ్ఞానవంతులను చేయడమే జేవీవీ లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. సుదీర్ఘకాలం నుంచి పట్టణంలో పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ, మూఢ నమ్మకాలను పారదోలడం, కూల్ డ్రింక్స్ వద్దు సహజ పానీయాలు ముద్దు అంటూ చైతన్య కార్యక్రమాలు, పది విద్యార్థులకు సైన్స్ చెకుముకి టాలెంట్ టెస్ట్, ప్రతిభా పురస్కారాలు అందించడం తదితర కార్యక్రమాలను ఉద్యమంలా నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా చేపట్టబోయే కార్యక్రమాల గురించి కార్యాచరణ రూపొందించామన్నారు. కార్యక్రమంలో జీ హరినాథ్, సుబ్బరాయశర్మ, జిల్లా నాయకులు పాపిశెట్టి జానకిరామ్, కల్యాణి, జమీర్, మాధవ, కల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు బ్యాంకులో వేయొద్దు

● ఎన్నికల కమిషన్‌కు పోస్ట్ ద్వారా అర్జీలు



సీఎస్, ఈసీ కి పంపిన అర్జీలను ఆవిష్కరిస్తున్న దళిత నేతలు

కావలి, మే17: వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్లు బ్యాంకులో వేయవద్దని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి డిమాండ్ చేశారు. ఈమేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్నికల కమిషన్‌కు పోస్ట్ ద్వారా అర్జీలు పంపినట్లు ఆయన తెలిపారు. పోస్ట్‌ద్వారా పంపిన అర్జీలను శుక్రవారం కావలి ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాంకర్లు రకరకాల కొర్రీలు పెట్టడం ద్వారా ఈనెల 1న వృద్ధులు, దివ్యాంగులకు బ్యాంకులలో వేసిన పింఛన్ సగం మందికి పైగా పొందలేక పోయారన్నారు. పైగా బ్యాంకులకు వెళ్లాలంటే వారు అనేక ఇబ్బందులకు గురయ్యారని, ఇప్పటికీ బ్యాంకుల నుంచి పింఛన్లు అందని వారు చాలామంది ఉన్నారన్నారు. ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో సచివాలయ ఉద్యోగులు 12 మంది ఉన్నారని వారి ద్వారా జూన్ మాసం పింఛన్లు నేరుగా ఇళ్లకు అందచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సమితి నేతలు ముక్కు మోహన్‌రావు, జడ్డా వాసు, తిరుపతి, జానీ బాష తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

ఆత్మకూరు, మే 17 : మునిసిపాలిటీ పరిధిలో ఇటీవల మృతి చెందిన ఆరు కుటుంబాల సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 10,000 వంతున రూ. 60,000లను సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి నేతృత్వంలో అందజేశారు. 17వ వార్డు పరిధిలోని షేక్ ఖాదర్‌బాష, 3వ వార్డు పరిధిలో కొప్పవరపు వెంకటశేషయ్య, 12వ వార్డులో మాముడూరు గోపికృష్ణ, 9వ వార్డులో దేవరల్లి లక్ష్మమ్మ, 11వ వార్డులో తంగిళ్లపల్లి పెద్దలక్ష్మమ్మ, 12వ వార్డులో కటారి నాగరాజు కుటుంబాలను ట్రస్ట్ సభ్యులు పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేల వంతున ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ఖరీఫ్ సాగుకు రైతులు దుక్కులు చేసుకోవాలి

కందుకూరు, మే 17 : ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసే పంటలపై రైతులకు వ్యవసాయ, వాతావరణ సూచనలను కందుకూరు విజ్ఞాన్ కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జీ ప్రసాద్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత వాతావరణ శాఖ సమాచారం మేరకు ఈ ఖరీఫ్ సీజన్‌లో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగా నమోదవుతుందని, జూన్ మొదటి వారంలోనే ఋతు పవనాలు రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని, రైతులు దుక్కులు చేసుకోవాలని, దీని ద్వారా నిద్రావస్థలో ఉన్న చీడపీడలు, శిలీంద్రాలు, ఇతర హానికర సూక్ష్మజీవులు పైకితేలి పక్షులకు ఆహారంగా మారడం, లేదంటే ఎండకు చనిపోవడం జరుగుతుందని పేర్కొన్నారు. దీనిద్వారా రైతులకు కలుపు, తెగుళ్ల సమస్యలు తగ్గుతాయని చెప్పారు. ఈ తేమను ఉపయోగించుకొని పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలగ, పిల్లిపెసర, ఉలవ, అలసంద వంటి వాటిని పొలంలో చల్లుకొని 40 రోజుల తరువాత సగం పూత దశలో ఉన్నప్పుడు పొలంలో రోటవేటర్ సహాయంతో కలియదున్నుకోవడం ద్వారా భూమిలో సేంద్రియ కర్బనం పెరిగి పంట దిగుబడి పెరుగుతుందని సూచించారు. శనగ, మినుము, కంది, పెసర, వేరుశనగ వంటి పంటలలో శిలీంద్రం ద్వారా నష్టపరిచే ఎండుతెగులు, మొదలుకుళ్లు, వేరుకుళ్లు తెగుళ్లు రాకండా ట్రైకోడర్మావిరిడే, సూడోమోనాస్, వంటి జీవ శిలింద్ర నాశినులను 2 కిలోల చొప్పున 100 కిలోల మగ్గిన పేడఎరువు, 20 కిలోల వేపచెక్క కలిపి నీడలో 15రోజులు మగ్గపెట్టి తేమ ఉన్నప్పుడు పొలంలో చల్లుకోవాలని సూచించారు.

రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలి

ఆత్మకూరు, మే 17: సోమశిల జలాశయం పరిధిలో సాగునీటి కొరత ఉండడంతో మండల పరిధిలోని రైతులు వరికి బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. బోర్ల ద్వారా వరిపైరు సాగు చేపట్టడంతో భూగర్భ జలాలు అడుగంటి తాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. వరిలో ఒక ఎకరాకు వాడే నీటిని ఆరుతడి పంటలకు వాడితే 5 నుంచి 7 ఎకరాలకు సరిపోతుందన్నారు. కావున రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు.

ఎన్నికల నగదు చెల్లించాలంటూ ఆందోళన



వినతి పత్రాన్ని అందజేస్తున్న బీఎల్‌వోలు

వరికుంటపాడు, మే17 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈ నెల 12, 13వ తేదీల్లో ఎన్నికల విధులు నిర్వర్తించిన తమకు నగదు చెల్లించాలంటూ శుక్రవారం బీఎల్‌వోలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు కే. ప్రభుదాసు మాట్లాడుతూ 39 కేంద్రాల పరిధిలోని పంచాయతీల్లోని కార్యదర్శులు, వీఆర్వోలు, వీఆర్ఏలు, సచివాలయ సిబ్బంది ఎంతో నిబద్ధతతో విధులు నిర్వర్తించడం జరిగిందన్నారు. వీటికి సంబంధించి ఎన్నికల కమిషన్ విడుదల చేసిన నిధులను అధికారులు తమకు అందజేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. పంచాయతీ కార్యదర్శులు ఒక్కో బూత్‌కు సుమారు రూ.13 వేల వరకు ఖర్చు చేసినప్పటికీ కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే అందజేయడం ఎంత వరకు సమంజసమన్నారు. భోజనం సైతం నాసిరకంగా అందజేశారని దుయ్యబట్టారు. అలాగే తమతో పాటు వీఆర్ఏకు, ఏఎన్‌ఎంలకు రోజు వారి అలవెన్స్‌లు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బీఎల్‌వోలు వినతి పత్రం అందజేశారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ఆర్మీ ఉద్యోగులు



పోస్టల్ బ్యాలెట్లను సబ్‌కలెక్టర్ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తున్న అధికారులు

కందుకూరు, మే 17 : ఆర్మీ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించు కుంటున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం కందు కూరు నియోజక వర్గానికి చెందిన 13 మంది ఆర్మీ అధికారులు, ఉద్యోగులు పోస్టు ద్వారా ఓటును ఎన్నికల అధికారులకు పంపించారు. నియోజకవర్గంలో మొత్తం 66 మంది ఆర్మీ ఉద్యోగులు ఓటు నమోదు చేసుకోగా ఇప్పటి వరకు 16 మంది పోస్టల్ బ్యాలెట్‌లు మాత్రమే వచ్చాయని జూన్ 4వ తేదీ ఉదయం 8గంటల వరకు అవకాశం ఉందని ఎన్నికల నిర్వాహణ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు చేరిన ఆర్మీ ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్లను సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్‌లో రాజకీయ పార్టీల ఎన్నికల ఏజంట్ల సమక్షంలో భద్రపరిచారు.

నిరుపయోగంగా ప్రభుత్వ కార్యాలయ భవనాలు



చినపవని గ్రామానికి 3 కి.మీ దూరంలో నిర్మించిన హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు

లింగసముద్రం, మే 17 : గ్రామాలకు దూరంగా ప్రభుత్వ కార్యాలయాల భవనాలు నిర్మించడంతో అధికారులు, సిబ్బంది, ప్రజలు వెళ్లడం లేదు. దీంతో సదరు భవనాలు నిరుపయోగంగా మారాయి. మండలంలోని చినపవని గ్రామానికి 3 కి.మీ దూరంలో రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనాలను నిర్మించారు. ఇక్కడ జనసంచారం కనుచూపు మేరలో ఉండదు. దీంతో ఈ రెండు కేంద్రాలలో పనిచేసే మహిళా సిబ్బంది భయపడుతున్నారు. దీంతో వారు గ్రామంలో సచివాలయం, పశు సంవర్ధక కేంద్రంలో పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే పెంట్రాల, మొగిలిచెర్ల, తిమ్మారెడ్డిపాలెం గ్రామాల్లో కూడా ఊరికి దూరంగా ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించడంతో అక్కడకు సిబ్బంది వెళ్లకుండా గ్రామాలలోని సచివాలయాలలో అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందిస్తున్నారు. దీంతో లక్షలాది రూపాలయలతో ఊరికి దూరంగా నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారాయని గ్రామస్థులు విమర్శిస్తున్నారు.

జలం లేని జలజీవన్

● నీరందక మండల వాసుల అవస్థలు



గుడవళ్లూరులోని ఓవర్ హెడ్‌ట్యాంకు

కొండాపురం, మే 17: వేసవికాలం రావడంతో గ్రామాలలో సగటు నీటి వినియోగం ఎక్కువయ్యింది. ఆస్థాయిలో మండలంలో ఏగ్రామంలోనూ నీటి సరపరా జరగడంలేదు. జలజీవన్ మిషన్ వంటి పథకాలతో ప్రతి ఇంటికి నేరుగా కుళాయిద్వారా ఉచితంగా నీటి సరపరాను చేస్తున్నామనే ప్రభుత్వం ప్రకటన క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోలేదు. జలజీవన్ మిషన్ జలం లేని మిషన్‌గా మారిందని మండలవాసులు అంటున్నారు, దీంతో రోజువారీ వాడుకునేందుకు నీరు సక్రమంగా అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలపరిధిలో 19 పంచాయతీలలో దాదాపు 52 గ్రామాలున్నాయి. మండలంలో దాదాపుగా 10 వేలవరకు ఇళ్లు ఉండగా జనాభా సుమారు 39 వేలవరకు ఉంది. గతంలో ఓవర్ హెడ్ ట్యాంకులకు నీరు ఎక్కించి పైపులైన్ల ద్వారా గ్రామ ప్రజలకు నీటి సరఫరా చేస్తుండేవారు. ఈవిధానంలో ప్రెషర్‌తోపాటు ఎక్కుసమయం నీరు వస్తుండటంతో వ్రతి ఇంటికీ సరిపడేవిధంగా నీరు అందేవి. తర్వాతి కాలంలో కొన్ని గ్రామాలలో ఓవర్ హెడ్ ట్యాంకులను పక్కనపెట్టి నేరుగా బోర్లువేసి మోటార్లద్వారా పైపులైన్లకు నీటి తరలించి ఇళ్లకు సరఫరా చేస్తున్నారు. ఇక్కడనుండే నీటి సమస్య మొదలయ్యింది. ఏర్పాటుచేసిన మోటార్లు మూడు ఫేజుల విద్యుత్ ఉన్నప్పుడు మాత్రమే పనిచేస్తుండటంతో ఆసమయంలో పైపులైన్లద్వారా కొందరికి మాత్రమే నీరు అందుతుంది. పైపులైన్లకు చిన్న మోటార్లను బిగించుకొని నీటిని తోడుతుండటంతో గ్రామాలలో మోటారు బిగించుకోని వారందరికీ నీరు అందడంలేదు. దీంతో నీరందక పలువురు అల్లాడుతున్నారు. ప్రత్యామ్నాయంలేక రోజువారి వినియోగం కొరకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పాలకులు, అధికారులు పట్టించకోవడం లేదని ప్రజలు అంటున్నారు.

జలజీవన్‌తో తీవ్రమైన సమస్య

కేంద్రప్రభుత్వ సహకారంతో రాష్ట్రం నూతనంగా ఇటీవల జలజీవన్ అనే పథకాన్ని తీసుకువచ్చింది. ఈపథకం ద్వారా నూతనంగా బోర్లు వేసి మోటార్లు బిగించి పంచాయతీలలోని మజారా గ్రామాలకు పైపులైన్లు వేసి కుళాయి బిగించి ఉచితంగా ఇంటింటికీ నీటిని సరఫరాచేయాల్సి ఉంది. పైపులైన్లు పొడిగించడ జరిగింది కానీ బోర్లు వేయలేదు. దీంతో అంతకు ముందున్న నీటిసరఫరాకంటే ఎక్కువవ్వడంతో గ్రామాలలో ఎక్కువమందికి నీరు అందడం లేదు. వేసవికాలం రావడంతో నీటి సమస్య ఎక్కువవ్వడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి మండలంలో పలు గ్రామాలలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సామాన్యుడికి భారం.. ఇంటి నిర్మాణం

రోజురోజుకు పెరుగుతున్న సిమెంట్, ఇనుము ధరలు



ఉదయగిరిలో అర్ధంతరంగా ఆగిన భవన నిర్మాణం



నింగినంటిన ఇసుక, ఇసుక

ఉదయగిరి, మే 17 : సామాన్యుడి సొంత ఇంటి కల కలగానే మిగిలిపోతోంది. రోజురోజుకు పెరుగుతున్న సిమెంట్, ఇనుము ధరలతో పేద మధ్య తరగతి కుటుంబాలు ఇల్లు కట్టుకోవడానికి సతమతమవుతున్నాయి. ఇల్లు కట్టుకోవాలంటే ఇంటి నిర్మాణం పూర్తి చేసేసరికి అనుకున్నదానికంటే బడ్జెట్ రెట్టింపై అప్పుల పాలవుతున్నారు. అప్పు దొరకని వారి ఇంటి నిర్మాణాలు మాత్రం అర్ధాంతరంగా ఆగిపోవాల్సిన పరిస్థితి. ఇల్లు లేని పేద మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వం ఇచ్చే పక్కా గృహాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు, ఐదేళ్లుగా ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయకపోవడంతో ఇళ్ల నిర్మాణాల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో వాటిపై ఆశలు వదులుకున్న సామాన్యులు సొంతంగా ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించారు. అయితే ఇంటి నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఇసుక, కంకర, ఇటుకల ధరలు రోజురోజుకు పెరుగుతుండడంతో సామాన్య ప్రజలకు ఇళ్ల నిర్మాణం భారంగా మారింది. రెండేళ్ల క్రితం రూ.250లు ఉన్న సిమెంట్ బస్తా ధర ప్రస్తుతం రూ.350 నుంచి రూ.380 లు వరకు దాటింది, దీంతో ఒక్కో బస్తాపై వందకు పైగా అదనపు భారం పడుతుంది, టన్ను ఇనుము గతంలో రూ.45వేల నుంచి రూ.50 వేల వరకు ఉండేది, ఇప్పుడు రూ.58వేల నుంచి రూ.60 వేలకు పైగా ధర పలుకుతోంది. ఇటుకల ధర రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకు పెరిగిపోయి ఆకాశానంటుతున్నాయి. అలాగే ఇసుక ట్రాక్టర్ రూ.4,500 వరకు పలుకుతోంది. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు కష్టతరంగా మారాయి. రోజురోజుకు ఇసుక, సిమెంట్, కంకర, ఇనుము ధరలు పెరుగుతున్నాయి, దీంతో సామాన్యులకు ఇల్లు కట్టుకోవాలంటే కష్టతరంగా మారింది.

- ఆటోలు, సిటీ బస్సుల ఇష్టానుసారం
- పార్కింగ్ ప్రాంతాల్లా బృందావనం, పొగతోట
- రోడ్ల ఆక్రమణలతో రాకపోకలకు కష్టాలు
- ఫైన్‌లపై ఉన్న శ్రద్ధ ట్రాఫిక్ నియంత్రణపై కరువు
- ప్రజలు, వాహన చోదకులకు తప్పని తిప్పలు
- ఈ సమస్యపై ఎస్పీ దృష్టి సారించేనా?



వీఆర్‌సీ కూడలిలో అడ్డదిడ్డంగా వాహన రాకపోకలు

ట్రాఫిక్ చక్రబంధంలో సింహపురి!



ఆత్మకూరు బస్టాండు అండర్ బ్రిడ్జి వద్ద స్తంభించిన ట్రాఫిక్



పార్కింగ్ ప్రాంతంలా ట్రంకురోడ్డు

నెల్లూరు(క్రైం), మే 17: నెల్లూరు నగరం పేరు చెబితేనే ముందుగా గుర్తుకు వచ్చేది ట్రాఫిక్ సమస్య. నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ప్రభుత్వాలు మారుతున్నా.. పాలకులు, అధికారులు మారుతున్నా నగరంలో ట్రాఫిక్ సమస్య మాత్రం పరిష్కారం కావడంలేదు. జిల్లాకు కొత్తగా ఎస్పీ వస్తే చాలు నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాం అంటారు.. కార్పొరేషన్ కమిషనర్లు వచ్చినప్పుడు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి బడ్జెట్ కేటాయిస్తున్నాం.. నగర రోడ్లపై ఆక్రమణలు తొలగిస్తాం, ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ, పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేస్తామంటూ చేసే ప్రకటనలు ఆచరణకు మాత్రం నోచుకోవడం లేదు. ఎంతో మంది జిల్లా కలెక్టర్లు నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలంటూ ఆదేశాలు జారీ చేస్తూనే ఉంటారు. ఇంత జరుగుతున్నా నెల్లూరు నగరంలో ట్రాఫిక్ సమస్య మాత్రం రోజురోజుకు పెరుగుతూనే ఉంది. రోడ్లు విస్తరణ లేదు.. షాపింగ్ మాల్స్ దుకాణాలకు పార్కింగ్ ప్రాంతాలు లేవు.. రోడ్ల ఆక్రమణలు.. వాహనాల సంఖ్య ప్రతి ఏటా రెండింతలు అవుతుండడంతో ఈ సమస్య జఠిలంగా మారింది. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు చలానాలు రాయడానికే పరిమితం అవుతున్నారు తప్ప పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆటోలు, అక్రమ ఆటో స్టాండ్లు, రోడ్డుకు మధ్యలో సిటీ బస్సులు నిలపడం వంటి వాటిపై దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ట్రాఫిక్ సమస్యతో ప్రతి రోజు ఉద్యోగులు, విద్యార్థులు, రోగులు, సామాన్య ప్రజలే ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.



స్టోన్‌హౌస్‌పేట వంతెనలపై ఆటో స్టాండు, ఆక్రమణలు

- ఆత్మకూరు బస్టాండు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సిటీ బస్సులు ఎక్కడ పడితే అక్కడ నిలపడం, వాటి పక్కనే ఆటోలు నిలుపుతుండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.
- పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద అడ్డదిడంగా కోవూరు వైపు వెళ్లే ఆటోలు, సిటీ బస్సులు ఆపడం.
- స్టోన్‌హౌస్‌పేటకు వెళ్లే మార్గంలో నాలుగు వంతెనలు ఉండగా పాత వంతెనలు రెండు పూర్తిగా ఆటో స్టాండ్లు, పండ్ల బండుల కోసమే అన్నట్లుగా మారాయి. మిగిలిన రెండు బ్రిడ్జిలు సైతం ఆటోలు, సిటీ బస్సులు అడ్డంగా నిలిపి వేస్తున్నారు.
- స్టోన్‌హౌస్‌పేటలోని దుకాణాలలో ఏ ఒక్కదానికి పార్కింగ్ లేకపోవడంతో వినియోగదారులు, దుకాణదారులు రోడ్లపైనే వాహనాలు నిలిపి వేస్తున్నారు. పప్పులవీధిలో నిత్యం భారీ వాహనాలు నిలిపి సరుకులు అన్‌లోడ్ చేస్తుండటంతో మరో వాహనం ఆ మార్గం గుండా వెళ్లే పరిస్థితులు కన్పించడం లేదు.
- పూలే బొమ్మ దాటిన తర్వాత పెట్రోల్ బంకును ఆనుకొని పదుల సంఖ్యలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు రాత్రి 7 దాటితే వరుసగా రోడ్డుకు ఇరువైపుల గంటల తరబడి నిలిపివేస్తారు. దీంతో ఈ రోడ్లపై వెళ్లే వాహనదారులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు.
- రామలింగాపురం వద్ద నూతనంగా నిర్మించి ఫ్లైఓవర్ కింది నాలుగు వైపుల నుంచి వచ్చే వాహనాలు ఎలా వెళ్లాలో దిశనిర్దేశం చేసేలా మార్కింగ్‌లు కూడా లేకపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.
- టీడీపీ కార్యాలయం నుంచి వనంతోపు సెంటర్ వరకు ఇరువైపుల రోడ్లపై చికెన్ పకోడా, ఫ్రైడ్‌రైస్, స్టిక్స్ ఇలా అనేక బండ్లు ఏర్పాటు చేశారు. ఈ బండ్ల వద్ద వాహనాలు రోడ్లపైనే పెట్టేస్తున్నారు.
- అయ్యప్పగుడి సెంటర్‌లో నాలుగు కూడలి రోడ్డు వద్ద ట్రాఫిక్ పోలీసులు తరచూ విధుల్లో ఉండక పోవడంతో తరచూ ట్రాఫిక్ జామ్‌తో పాటు ప్రమాదాలు జరుగుతన్నాయి.
- వేదాయపాలెం సెంటర్‌లో రోడ్డు ఆక్రమణలకు గురికావడంతో వాహనాల నిలిచి పోతున్నాయి.
- కరెంటాఫీసు సెంటర్ పార్కింగ్ ప్రాంతంగా మరిపోయింది.
- కొండాయపాలెం గేటు సెంటర్ నుంచి పొదలకూరు రోడ్డు వైపు వెళ్లేందుకు వాహనాలు ఏసీ స్టేడియం నుంచి తిరిగి రావాల్సి ఉంది. అయితే కొండాయపాలెం గేటు సెంటర్ నుంచే రాంగ్ రూట్‌లో పొదలకూరు రోడ్డులోకి వాహనలు ప్రవేశించడం ప్రమాదకరంగా మారింది.
- బొల్లినేని వైద్యశాల వద్ద ఆసుపత్రి నుంచి, పెట్రోల్‌బంకు నుంచి వాహనాలు బయటకు రావడం, అక్కడే మలుపు తిరగడం, రోడ్లు చిన్నవి కావడం ఇలా అనేక కారణాలతో నిత్యం వాహనాలు నిలిచి పోతుంటాయి.
- కేవీఆర్ పెట్రోల్ బంకుకు వెళ్లే దారిలో మద్యం మాల్ వద్ద వాహనలు తిరిగే మలుపు ఉండటం, వందలాది వాహనాలు ఒక్కసారిగా తిరుగుతుండటం, అదే సమయంలో నేరుగా వెళ్లే వాహనాలు వెళ్లడం ఇలా ఈ ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది.
- ఆర్టీసీ బస్టాండు వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవడం, అక్రమ ఆటో స్టాండులతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.
- ట్రాఫిక్‌కు అడ్డా అంటే కూరగాయల మార్కెట్ సెంటర్ అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ ప్రాంతంలోని పెద్దపెద్ద హోటల్స్‌కు సైతం పార్కింగ్‌లు లేదు. మార్కెట్‌కు వెళ్లే ప్రజలు వాహనాలు రోడ్లపై వదిలి వెళ్లాల్సిన సరిస్థితి నెలకొంది.
- లీలామహల్, పాత జెడ్పీ కార్యాలయాల వద్ద ఉన్న కళాశాలలు వదిలితే చాలు వీఆర్‌సీ కూడలిలో గంటల తరబడి వాహనాలు స్తంభిస్తాయి. ఇక ఈ ప్రాంతంలో రోడ్డుకు మధ్యలో సెంట్రల్ పార్కింగ్ ఏర్పాటు చేయడం, రోడ్డుకు సెంటర్‌తో పాటు రెండు వైపుల వాహనాలు నిలిపి వేస్తుండటంతో రోడ్డంతా పార్కింగ్ ప్రాంతంగా మారిపోతోంది.
- వీఆర్‌సీ నుంచి రామలింగాపురం రైల్వే అండర్ బ్రిడ్జీ ప్రాంతంలో రోడ్డు ఆక్రమణలు, పొగతోట నుంచి మార్కెట్ వైపు వచ్చే వాహనాలు, ఆటో స్టాండులతో నిత్యం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది.
- రామలింగాపురం పార్కింగ్ ప్రాంతమా అన్నట్లుగా మారింది.
- గాంధీబొమ్మ సెంటర్ వద్ద సిటీ బస్సులు, ఆటోలు ఇష్టానుసారంగా నిలిపివేస్తున్నా నియంత్రించే వారు లేరు.
- వ్యాపార కూడలి అయిన ట్రంకురోడ్డు ప్రాంతంలో ఒక్క దుకాణానికి పార్కింగ్ లేకపోవడంతో, కార్లు, ద్విచక్రవాహనాలు, ఆటోలు ఇష్టానుసారంగా రోడ్లపై నిలిపి వేస్తుండటంతో ట్రాఫిక్‌కు అడ్డాగా మారింది.
- వైద్యశాలలు అధికంగా ఉన్న పొగతోట, బృందావనం ప్రాంతాల్లోని రోడ్లు పూర్తిగా కార్లుతో నిండిపోతున్నాయి. ఆంబులెన్స్‌లు, అత్యవసర పరిస్థితుల్లో వైద్యశాలలకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పార్కింగ్‌లు ఏవి?

- చిన్నబజారు, పెద్దబజారు ప్రాంతాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆ వైపు వాహనాల్లో వెళుతున్నావంటే ఏ సమయానికి తిరిగి వస్తామో తెలియదు.

నగరంలో వాహన పార్కింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తామని పలువురు అధికారులు అనేకసార్లు చెప్పిన మాటలు నీటి మూటలు గానే మిగిలిపోయాయి. ఆత్మకూరు బస్టాండు నుంచి ఆర్టీసీ బస్టాండు మధ్యలో పార్కింగ్ పాయింట్‌లు ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉంటుందని ప్రజలు అంటున్నారు. ఆత్మకూరు బస్టాండు వద్ద నుంచి సిటీ బస్సుల స్టాండ్‌ను సీసీఎస్ పోలీస్ స్టేషన్ వద్దకు మార్చితే ఆత్మకూరు బస్టాండు రైల్వే అండర్ బ్రిడ్జీ వద్ద ట్రాఫిక్ సమస్య తగ్గుతోందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద, స్టోన్‌హౌస్‌పేటలోని బ్రిడ్జీలపై ఆటో స్టాండులను, సిటీ బస్సుల స్టాండును, ఆక్రమణలను తొలగించడంపై దృష్టి పెడితే ప్రయోజనం ఉంటుంది. పప్పుల వీధిలో రాత్రి సమయంలో సరుకులు అన్‌లోడ్ చేసుకునేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సార్వత్రిక ఎన్నికల సమయంలో జిల్లా పోలీసు బాస్‌గా కె ఆరీఫ్ హఫీజ్ బాధ్యతలు చేపట్టారు. ఆ క్షణం నుంచి ఆయన ఎన్నికల నిర్వహణపైనే దృష్టి సారించారు. అయితే

జిల్లా ఎస్పీ దృష్టి సారించేనా?

ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించి ప్రత్యక్షంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి జఠిలంగా ఉన్న ట్రాఫిక్ సమస్య నుంచి గట్టెక్కించాలని ప్రజలు కోరుతున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధన



జగద్గురువు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన పూజలో పాల్గొన్న భక్తులు

నెల్లూరు(సాంస్కృతికం), మే 17 : జిల్లాలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో 331వ ఆరాధనోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. నగరంలోని విరాట్ నగర్‌లో గాయత్రిదేవి విశ్వకర్మ భగవాన్, గోవిందమాంబ సమేత జగద్గురు శ్రీమద్ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో పట్టణ విశ్వకర్మ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆరాధనోత్సవంలో ఉదయం సుప్రభాతసేవ, కలశ తీర్థం, అభిషేకాలు, పూలంగిసేవ, సమాధి పూజ, హోమాలు ఘనంగా జరిగాయి. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. సాయంత్రం సహస్ర దీపాలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాల్లో భరతనాట్యం, కోలాటం అలరించాయి. ఫత్తేఖాన్‌పేట వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆరాధనలు జరిగాయి. పప్పులవీధి పాండురంగ అన్నదాన సమాజంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన, వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతిలను పునస్కరించుకుని అన్నప్రసాద వితరణ జరిగింది.

మారుతి న్యూ షిఫ్ట్ జడ్‌సిరీస్ కారు విడుదల



మారుతి న్యూషిఫ్ట్ కారు విడుదల చేస్తున్న షోరూం ప్రతినిధులు

నెల్లూరు(సాంస్కృతికం), మే 17 : నగరంలోని భార్గవి ఆటోమొబైల్స్‌లో శుక్రవారం మారుతి న్యూషిఫ్ట్ జడ్ సిరీస్ నూతన వెర్షన్ కారు మార్కెట్‌లోకి విడుదలైంది. ఈ కారు అత్యాధునిక న్యూజడ్ సిరీస్‌తోపాటు అత్యధిక ఫ్యూచర్లు ఉన్నాయని సేల్స్ మేనేజర్ రమేష్‌బాబు తెలిపారు. ఇందులో మొదటిసారిగా ఎల్ఈడీ ఫాగ్ లేయర్‌తో 6 ఎయిర్ బ్యాగ్‌లు ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కారులో 22.86 సీఎం స్మార్ట్ ప్లే వైర్‌లెస్ అండ్రాయిడ్ ఆటో, పార్కింగ్ కెమెరా, మల్టీఇన్‌ఫర్‌మేషన్ డిస్‌ప్లేని అమర్చినట్లు పేర్కొన్నారు. వీటితోపాటు అనేక అత్యాధునిక ఫీచర్లు ఉన్నాయన్నారు. ఈ కార్ల ధరలు రూ.6,49,000 నుంచి రూ.9,64,500 వరకు 9 రంగుల్లో లభిస్తాయని తెలిపారు. వీటిపై ఫైనాన్స్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం, సీజీఎం భార్గవి, ఆటోమొబైల్స్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

2 టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తుల స్వాధీనం

- షాపు యజమానులకు జరిమానా : ఎంహెచ్‌వో



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ ఉత్పత్తులతో అధికారులు

నెల్లూరు(సిటీ), మే 17 : నెల్లూరులోని స్టౌన్‌హౌస్‌పేట ప్రాంతంలో శుక్రవారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో 2 టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎంహెచ్‌వో వెంకటరమణయ్య తెలిపారు. ఈ మేరకు స్వాధీనం చేసుకున్న సొత్తును గోదాములకు తరలించిన ఆయన షాపు యజమానులకు జరిమానా విధించినట్లు తెలిపారు. నెల్లూరులో ఎక్కడైనా ప్లాస్టిక్ ఉత్పత్తులు క్రయ, విక్రయాలు జరుగుతున్నట్లు ప్రజలు గుర్తిస్తే వాటి సమాచారం స్థానిక సచివాలయాల్లోనూ, కార్పొరేషన్ కార్యాలయంలోనూ అందించాలని కోరారు. ప్లాస్టిక్ రహిత నెల్లూరును నిర్మించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని, ప్రజలు ఇందులో ప్రత్యక్ష భాగస్వామ్యం కావాలని కోరారు. అనంతరం పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు.

కసుమూరులో భక్తుల సందడి

వెంకటాచలం, మే 17 : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలీ దర్గాలో శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారికి తల నీలాలు సమర్పించగా, మరికొందరు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారికి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మస్తాన్ స్వామి వారి దర్గాను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరిం చారు.

వాహనాల పార్కింగ్ స్థలంగా మారిన షెడ్డు

- ఎండలో భక్తుల అవస్థలు



భక్తుల కోసం నిర్మించిన షెడ్డు కింద ఆపిన బైకులు

బుచ్చిరెడ్డిపాళెం, మే 17: మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం దాతల కోట్ల రూపాయల విరాళాలతో నిర్మించిన షెడ్డు వాహనాలకు పార్కింగ్ స్థలంగా తయారైనా పట్టించుకునే నాథుడే లేడని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జొన్నవాడ ఆలయానికి వచ్చే భక్తులు ఎండకు, వానకు తల దాచుకునే వసతిలేక పడుతున్న అవస్థలు చూసిన దాతలు వల్లూరు రవీంద్రారెడ్డి, పెద్ద కామాక్షమ్మ సుమారు కోటి రూపాయలతో గత రెండేళ్ల క్రితం షెడ్డు నిర్మించారు. కాగా, ఆలయానికి వచ్చే భక్తుల కోసం నిర్మించిన షెడ్డు బైకులు, కార్లకు పార్కింగ్ తయారైనా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మల, మూత్ర విసర్జనకు రూ. 30 : జొన్నవాడ ఆలయానికి వచ్చే భక్తుల కోసం దాతల సహకారంతో నిర్మించిన మరుగుదొడ్లు, స్నానపు గదులను ఉచితంగా వాడుకునే అవకాశం కల్పించాల్సిందిపోయి రూ.30 వసూలు చేస్తున్నారని భక్తులు వాపోతున్నారు. సులభ్ కాంప్లెక్స్‌లో కూడా లేనివిధంగా రూ.30 వసూలు చేయడం సరికాదని, ఆలయానికి వచ్చే భక్తులు మలమూత్ర విసర్జన, స్నానపు గదులను ఉచితంగా వాడుకునే అవకాశం కల్పించాలని భక్తులు అధికారులను కోరుతున్నారు.

డెంగ్యూ వ్యాధిపై అవగాహన

నెల్లూరు(సాంస్కృతికం), మే 17 : నగరంలోని కేంద్ర గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శుక్రవారం డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పించారు. నెల్లూరు పట్టణ ప్రజా సైన్స్ వేదిక అధ్యక్షుడు, సైన్స్ ఉపాధ్యాయుడు డెంగ్యూ జ్వరం, దోమలు నివారణ, జాగ్రత్తలు అనే అంశాలు వివరించారు. విద్యార్థులకు క్విజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కుమార్‌రాజా, లైబ్రేరియన్ ప్రసాద్, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమిదే గెలుపు

నెల్లూరు(సాంస్కృతికం), మే 17 : ఈనెల 13న జరిగిన పోలింగ్ సరళిని బట్టి ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధిస్తుందని పవన్‌కళ్యాణ్ అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టోని తెలిపారు. శుక్రవారం జర్నలిస్టు భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 5 ఏళ్ల జగన్మోహన్‌రెడ్డి విధ్వంసక పాలనకు చరమగీతం పాడాలన్న కసితో ప్రజలు ఓట్లు వేశారన్నారు. ఎన్డీఏ కూటమి విజయానికి జనసేన కార్యకర్తలు, వీర మహిళలు, పవన్‌కళ్యాణ్ అభిమానులు శక్తివంచన లేకుండా కృషి చేశారని తెలిపారు. ప్రభుత్వంపై వ్యతిరేకత ఉన్నందున ప్రజలు దేశం నలుమూలల నుంచే కాక ప్రవాస తెలుగువారు ప్రపంచ నలుమూలల నుంచి స్వచ్ఛందంగా వచ్చి ఓట్లు వేశారని వారందరికీ జనసేన పార్టీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. వెంకటగిరిలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేయడాన్ని ఖండించారు.

ఆదిశంకరాచార్య సంస్మరణ వారోత్సవాలు

నెల్లూరు(సాంస్కృతికం), మే 17 : నగరంలోని పొగతోట ఆదిశంకర ధ్యాన మందిరంలో శుక్రవారం ఆదిశంకరాచార్య సంస్మరణోత్సవ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ వారోత్సవాలు ఈనెల 24వ తేదీ వరకు కొనసాగుతాయి. ఈ సందర్భంగా ఉదయం తిరుపతికి చెందిన ఓరుగంటి శ్రీరామలాలశర్మచే చతుస్సూత్రిబాష్య ప్రవచనం జరిగింది. సాయంత్రం 6గంటల నుంచి దశశ్లోకి విచారః ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా లఘున్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేక అర్చనలు, పూజలు నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చక్రాలవారి ట్రస్ట్ ఎండీ చక్రాల ఆనందకుమార్, ఆదిశంకర ధ్యానమందిరం చైర్మన్ పారా శ్రీధర్‌శర్మ, మేనేజర్ చక్రాల వెంకటలక్ష్మీనరసింహం, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

మనుబోలు, మే 17: గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని పంచాయతీ విస్తరణాధికారి జీవీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో మాట్లాడారు. కార్యదర్శులు ఎన్నికల్ మూడ్ నుంచి బయటకు రావాలని, గ్రామాల్లోని కాలువల్లో ఎక్కడిచెత్త, మురుగు నిల్వ చేరి ఉందని వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని ఆయన కోరారు.

26న యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(సాంస్కృతికం), మే 17 : జిల్లాలోని యాదవ విద్యార్థులకు ఈనెల 26వ తేదీన ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని జిల్లా యాదవ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెరుమాళ్ల కొండయ్య తెలిపారు. శుక్రవారం ఓ నర్సింగ్ హోమ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది 10వ తరగతిలో 475 మార్కులు సాధించిన ఉమ్మడి నెల్లూరు జిల్లా, కందుకూరు డివిజన్‌లోని యాదవ విద్యార్థులు అర్హులన్నారు. అపోలో ఆసుపత్రికి ఎదురుగా ఉన్న జెట్టి శేషారెడ్డి భవనంలో జరిగే కార్యక్రమానికి 10వ తరగతి మార్కుల జాబితా, జెరాక్స్‌లతో హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9705800794, 9573105305ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి మాదాల వెంకటరాకేష్, గౌరవాధ్యక్షుడు గంగుల మధుసూదన్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకా మహేష్, కోశాధికారి ఒంటేరు హరి, సలహాదారులు పేలం సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కామాక్షితాయికి కుంకుమార్చన



బుచ్చిరెడ్డిపాళెం, మే 17: మండలంలోని జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన వైభవంగా జరిగింది. అనంతరం అమ్మవారిని పల్లకిలో కొలువుదీర్చి ఆలయం చుట్టూ ఊరేగించా రు. ఉదయం స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి నవావరణ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తు లు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

కానిస్టేబుల్‌కు అస్వస్థత

నెల్లూరు(హరనాథపురం), మే 17 : విధి నిర్వహణకు శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చిన మల్లికార్జున అనే కానిస్టేబుల్ అస్వస్థతకు గురయ్యారు. ఈతి గమనించిన అక్కడ డ్యూటీలో ఉన్న హెడ్ కానిస్టేబుల్, ఆర్మ్‌డ్ గార్డులు ఆయనను తక్షణమే చికిత్స నిమిత్తం 108లో వైద్యశాలకు తరలించారు.

గ్రామాల్లో జోరుగా గుట్కా వ్యాపారం!



కోవూరు, మే 17 : కోవూరు పట్టణం, పరిసర ప్రాంతాల్లో గుట్కాల వ్యాపారం జోరుగా సాగుతోంది. పోలీసు సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో పోలీసులు ఎన్ని దాడులు చేసి కేసులు నమోదుచేసినప్పటికీ వ్యాపారులు గుట్టుగా వ్యాపారం కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం మాదకద్రవ్యాల వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టి ఏర్పాటుచేసిన స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో పట్టించుకోకపోవడంతో గుట్కాల వినియోగం బాగా పెరిగింది. అధికారుల కళ్ళుగప్పి వ్యాపారులు గుట్కాల సంచుల్ని మోటారుబైక్‌లు, ఆర్టీసీ బస్సులు, ఆటోల్లో తరలిస్తున్నారు. కూరగాయల సంచుల మాటున, ఫలసరకుల సంచుల్లో గ్రామాలకు గుట్కాల ప్యాకెట్లను తీసుకువెళ్తున్నారు. కోవూరు మండల పరిధిలోని మారుమూల కాలనీల్లో సైతం గుట్కాల్ని యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. గుట్కాల వ్యాపారాన్ని అడ్డుకోవాల్సిందిగా పలు స్వచ్ఛంద సంస్థలు పోలీసు అధికారులను కోరుతున్నారు. అలాగే స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గుట్కాల జోలికి వెళ్లొద్దని యువకుల్ని కోరుతున్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి : జేవీవీ

యువకులకు ఎంతో భవిష్యత్తు ఉంది. మాదక ద్రవ్యాలు ముఖ్యంగా గుట్కాలు సేవించి అనారోగ్యం పాలవడం బాధాకరం. ఎంతో ప్రచారం చేస్తున్నాం గుట్కాల వినియోగానికి వ్యతిరేకంగా అందరూ కృషి చేయాలని జేవీవీ నాయకుడు ముక్కు చంద్రమౌళి కోరారు.

యువతను చైతన్యవంతం చేయాలి

గుట్కాల వినియోగానికి వ్యతిరేకంగా యువకుల్ని చైతన్యవంతం చేయాలి. గ్రామాల్లో ప్రచారం చేయాలి. పోలీసులు, స్వచ్ఛంద సేవా సంస్థలు యువకుల్ని కాపాడాలి. క్యాన్సర్ బారిన యువకులు పడకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని రైతు నాయకుడు పి విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.

పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం : ఎస్ఐ

పోలీసు స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గుట్కాల అమ్మకాలు జరగడం లేదు. నిత్యం నిఘా పెట్టాం. ఎక్కడా గుట్కాల వినియోగం లేదు. ఎన్నో దుకాణాలపై దృష్టి పెట్టాము. గుట్కాల వ్యాపారం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకొంటున్నాం. గుట్కాలు విక్రయించే దుకాణాలపై సమాచారమిస్తే యజమానులపై తగు చర్యలు తీసుకుంటామని కోవూరు ఎస్ఐ రంగనాథ్ గౌడ్ తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 30 గంటలు



తిరుమల, మే 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్రం భక్తుల రద్దీతో కిటకిటలాడుతోంది. శ్రీవారి దర్శనానికి 30 గంటల సమయం పడుతోంది. శ్రీవారి ఆలయ ప్రాంతంతో పాటు మాడ వీధులు, లడ్డూప్రసాద కేంద్రం, అన్నప్రసాద భవనం, బస్టాండ్ ప్రాంతాల్లో ఈ రద్దీ అధికంగా కనిపిస్తోంది. కాలినడకన వచ్చే భక్తుల సంఖ్య కూడా బాగా పెరిగింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి పార్క్‌లోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ మీదుగా రింగ్‌రోడ్డులో శిలాతోరణం వరకు దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల మేరకు వ్యాపించింది.కాటేజీల కోసం, తలనీలాల సమర్పణకు ఎక్కువ సమయం పడుతోంది. సందర్శనీయ ప్రదేశాలైన పాప వినాశనం, శ్రీవారిపాదాల ప్రాంతాల్లో రద్దీ నెలకొంది.అలిపిరి చెక్‌పాయింట్‌లోనూ వాహనాలు భారీగా నిలిచిపోవడంతో తనిఖీలను వేగవంతం చేశారు.



వర్షంతో పెరిగిన చలి

తిరుమలలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచే వాతావరణం చల్లగా మారింది. మధ్యాహ్నం తర్వాత భారీ వర్షం కురవడంతో దర్శనం కోసం చంటిబిడ్డలతో వచ్చినవారు, వృద్ధులు అగచాట్లు పడ్డారు. శ్రీవారి ఆలయ ప్రాంతంతో పాటు మాడవీధులు, కాటేజీలు, రోడ్లు జలమయమయ్యాయి. సాయంత్రం శేషాచల కొండలు తెల్లటి మేఘాలతో కనువిందు చేశాయి. వర్ష ప్రభావంతో తిరుమలలో చలితీవ్రత పెరిగింది.తిరుపతిలోనే శుక్రవారం సాయంత్రం కాసేపు చినుకులు పడడంతో వాతావరణం చల్లబడింది.



పెళ్లివేడుక



పెండ్లి మండపం వద్ద గజవాహనంపై మలయప్ప స్వామి

రంగురంగుల పుష్పాలతో భూలోక వైకుంఠాన్ని తలపించే రీతిలో శోభాయమానంగా తీర్చిదిద్దిన పరిణయ మండపం....గజవాహనాన్ని అధిరోహించి ఊరేగింపుగా వచ్చిన వరుడు మలయప్ప స్వామి....పల్లకిపై వెన్నంటి చేరుకున్న శ్రీదేవి, భూదేవి... తిరుమలలోని నారాయణ గిరి ఉద్యానవనం వద్ద శుక్రవారం సాయంత్రం పద్మావతి పరిణయోత్సవ వేడుక దృశ్యమిది. **- తిరుమల**



కల్యాణోత్సవం

జాతర కళ



తిరుపతి గంగ జాతరలో శుక్రవారం వివిధ కళారూపాల ప్రదర్శన ఆకట్టుకుంది. తప్పెటగుళ్లు, కేరళ సంప్రదాయ వాద్యసంగీతం, దుర్గామాత అలంకారంలో దుష్టసంహారం అలరించాయి.



చేస్తారా.... చేయరా?

డీకేటీ భూముల రిజిస్ట్రేషన్‌కు వైసీపీ ముఖ్య నేత ఒత్తిడి



తిరుపతి, మే 17 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో విలువైన డీకేటీ భూములను రిజిస్ట్రేషన్ చేసివ్వాలంటూ వైసీపీ ముఖ్యనేత అధికారులపై తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. నియోజకవర్గవ్యాప్తంగా వందలాది ఎకరాల డీకేటీ భూములను కొద్ది నెలల క్రితం ఫ్రీ హోల్డ్ జాబితాలో పెట్టారు. డీకేటీ పట్టా పొంది 20 ఏళ్లు పూర్తయిన భూములను ఫ్రీ హోల్డ్‌గా గుర్తించారు. వైసీపీ ముఖ్యనేత తన అనుచరులతో కొద్దినెలల క్రితం ఈ భూములను కొనుగోలు చేయించినట్లు ఆరోపణలున్నాయి.ఆయనకు సన్నిహితంగా మెలిగిన అనుచరుడు ఇటీవల తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.వాటిలో ఒకటి డీకేటీ భూముల స్కాం. మార్చిలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి డీకేటీ భూముల రిజిస్ట్రేషన్‌ను అధికారులు పక్కన పెట్టారు. ఐదు రోజుల క్రితం పోలింగ్ ముగియడంతో వైసీపీ ముఖ్యనేత చాపకింద నీరులా డీకేటీ భూముల రిజిస్ట్రేషన్ పనులను చక్కబెట్టుకునే పనిలో పడ్డారు. శుక్రవారం రెవెన్యూ అధికారులను పిలిపించి ఆయా మండలాల పరిధిలోని భూముల రిజిస్ట్రేషన్‌కు క్లియరెన్స్ ఇవ్వాలని ఒత్తిడి చేసినట్లు ప్రచారం జరుగుతోంది. జూన్ 4వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో వుంటుందని, అప్పటిదాకా రిజిస్ట్రేషన్‌కు క్లియరెన్స్ ఇవ్వలేమంటూ కొందరు అధికారులు చేతులెత్తేసినట్లు తెలిసింది.అయితే ఎలాగైనా చేయాలంటూ ఆయన ఒత్తిడి చేస్తుండడంతో విషయం బయటకు పొక్కింది.

తగ్గిపోయిన నిమ్మ ధరలు

గూడూరు అర్బన్, మే 17: గూడూరు మార్కెట్‌లో శుక్రవారం నిమ్మకాయల ధరలు తగ్గిపోయాయి. నాలుగురోజుల క్రితం కిలో రూ.80 నుంచి రూ.130 వరకు పలికిన నిమ్మకాయలు శుక్రవారం రూ. 30 నుంచి రూ.90 మాత్రమే పలికాయి.ఉత్తరాది రాష్ట్రాల్లో వర్షాలతో నిమ్మధరలు శుక్రవారం పడిపోగా టిక్కీ బస్తా రూ.1500కు, లూజుబస్తా రూ.7,200కు వ్యాపారులు కొనుగోలు చేశారు.పెరిగిన ధరలు పదిరోజులు కూడా వుండకపోవడంతో నిమ్మ రైతులు నిరాశపడ్డారు.



విమానమెక్కిన విద్యార్థులు



చెన్నై ఎయిర్‌పోర్టులో విద్యార్థులు

సత్యవేడు, మే 17: సత్యవేడు మండలం మాధనపాళెం జడ్పీ హైస్కూల్లో ఇటీవల టెన్త్ పరీక్షల్లో ప్రతిభ చూపిన నలుగురు విద్యార్థులకు విమానమెక్కే అవకాశం కలిగింది. పదవ తరగతిలో 500పైబడి మార్కులు సాధించిన విద్యార్థులను విమానంలో విహారయాత్రకు తన ఖర్చులతో పంపుతానని గ్రామానికి చెందిన ఉమాపతి గతంలో ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం మాధనపాళెం ఉన్నత పాఠశాలలో ఈసారి టెన్త్ పరీక్షలు రాసి ఐదు వందల కంటే ఎక్కువ మార్కులు సాధించిన పురుషోత్తం(552), వి.విష్ణు(515), మహా(509), తనూజ(505)తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముని మోహన్‌ను చెన్నై నుంచి విమానంలో శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.వీరంతా రెండు రోజుల పాటు వివిధ ప్రాంతాలను సందర్శించాక తిరిగి సొంతూరుకు చేరుకోనున్నారు.

ఒంటరి ఏనుగు జాడ గుర్తింపు

చంద్రగిరి, మే 17: చంద్రగిరి మండలం ఆముదాల కోన ఎస్టీ కాలనీ పీతల చెరువు సమీపంలోని అటవీ ప్రాంతంలో ఒంటరి ఏనుగు జాడను శుక్రవారం అటవీ అధికారులు గుర్తించారు. మూడు రోజులుగా పనపాకం డిప్యూటీ రేంజి అధికారి చినబాబు ఆధ్వర్యంలో ఏనుగు జాడ కోసం గాలిస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఏనుగు పాదముద్రలు, వ్యర్థాలు కనిపించాయి. దీంతో ఎస్టీ కాలనీతో పాటు పరిసర గ్రామాల్లో ప్రజలను, రైతులను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఒంటరిగా పొలాల వద్దకు, అటవీ ప్రాంతంలోకి వెళ్ళకూడదని హెచ్చరికలు జారీ చేశారు. ఒంటరి ఏనుగు ఈనెల 12న చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలం వెంగంపల్లె ఎస్టీ కాలనీకి చెందిన చిన్నయ్యపై దాడి చేసి చంపేసింది. అక్కడి నుంచి పూతలపట్టు మండలం మీదుగా పాకాల మండల సరిహద్దుల్లోకి చొరబడి 13న చెన్నుగారిపల్లె పంచాయతీ సమీపంలో తమిళనాడుకు చెందిన కాతవరాయన్‌పై దాడి చేసి హతమార్చింది.తాజాగా ఆ ఏనుగు తమ ప్రాంతంలో సంచరిస్తోందని తెలిసి ఆముదాల కోన ఎస్టీ కాలనీ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. జాడ తెలిసినందున ఏనుగును అటవీ ప్రాంతంలోకి తరిమేందుకు ప్రయత్నిస్తున్నామని అటవీ సిబ్బంది తెలిపారు.

● ఆముదాలకోన ఎస్టీ కాలనీ వద్ద గజరాజు పాదముద్రలు



ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ తనిఖీ

● మూడంచెల భద్రత, 144 సెక్షన్ అమలును పరిశీలించిన కలెక్టర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 17: తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను శుక్రవారం కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్‌కు మూడంచెల భద్రత, 144 సెక్షన్ అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్ట్రాంగ్ రూమ్ భద్రత పటిష్ఠంగా ఉందన్నారు. మొదటి అంచెలో కేంద్ర సాయుధ బలగాలు, రెండో అంచెలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు, మూడో అంచెలో స్థానిక పోలీసులు నిత్యం బందోబస్తు నిర్వహిస్తున్నారని వివరించారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్ భద్రతతోపాటు కౌంటింగ్ ప్రక్రియ కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు అదితిసింగ్, నిషాంత్‌రెడ్డి, నరసింహులు, ఏఎస్పీ కులశేఖర్, డీఆర్వో పెంచలకిషోర్, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



పోలీసులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

భద్రత కఠినతరం చేయండి: ముఖేష్‌కుమార్

తిరుపతి(కలెక్టరేట్): పోలింగ్, తర్వాత జిల్లాలో చోటు చేసుకున్న సంఘటనల నేపథ్యంలో ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రత కట్టుదిట్టం చేయాలని జిల్లా అధికారులను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. విజయవాడ నుంచి సీఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ హరీష్‌గుప్తాతో కలిసి వర్చువల్ విధానంలో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, అదనపు ఎస్పీ శ్రీనివాసరావు హాజరయ్యారు. అధికారులు స్ట్రాంగ్ రూమ్ పరిశీలించాక సందర్శకుల రిజిస్టర్‌లో వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ఎప్పటికపుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఫేక్ న్యూస్‌ప్రచారం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీ సూచించారు. డీఆర్వో పెంచలకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఈసీ నియమిత సిట్‌లో ఏసీబీ డీఎస్పీకి చోటు



రవిమనోహరాచారి

తిరుపతి, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల పోలింగ్ రోజు, తర్వాత సంభవించిన హింసాత్మక ఘటనలపై విచారణ నిమిత్తం ఎన్నికల కమిషన్ నియమించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌లో తిరుపతి ఏసీబీ డీఎస్పీ కె.రవిమనోహరాచారికి చోటు దక్కింది. ఎస్ఐగా, సీఐగా, డీఎస్పీగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుదీర్ఘకాలం ఈయన పనిచేశారు. కౌంటర్ ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచి, లా అండ్ ఆర్డర్ వంటి మూడు కీలక విభాగాల్లో విధులు నిర్వర్తించిన ఈయనకు ఈ ప్రాంతంపై సమగ్రమైన అవగాహన, ఇక్కడి పరిస్థితులను అంచనా వేయడంలో అవగాహన వున్నాయి. అనేక సంచలనాత్మక కేసులను పరిష్కరించి సమర్థుడైన అధికారిగా గుర్తింపు పొందారు. తాజాగా ఎన్నికల పోలింగ్ రోజు, తర్వాత తిరుపతి, పల్నాడు, అనంతపురం జిల్లాల్లో జరిగిన పలు హింసాత్మక ఘటనలపై లోతుగా విచారణ జరిపి, స్థానిక పోలీసు అధికారుల వైఫల్యాన్ని గుర్తించడంతో పాటు కేసుల నమోదులో అవసరమైన మార్పు చేర్పులు, సెక్షన్ల మార్పు చేర్పులను సూచించడం, శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించిన అంశాలపై సిఫారసులు చేయడం వంటివి సిట్‌కు ఈసీ అప్పగించిన బాధ్యతలు. సిట్‌లో మొత్తం 13మంది సభ్యులుండగా అందులో రాయలసీమ నుంచీ ఎంపికైన ఇద్దరు అధికారుల్లో రవిమనోహరాచారి ఒకరు. ఈసీ ద్వారా ప్రత్యేక దర్యాప్తు బృందంలో నియమితులు కావడం ఆయన సమర్థతకు, అనుభవానికి దక్కిన గుర్తింపుగా ఆ శాఖ వర్గాలు భావిస్తున్నాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గూడూరు అర్బన్/ వెంకటగిరి టౌన్/ కోట, మే 17: గూడూరు పట్టణంలోని అడవయ్యకాలనీ సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద మరమ్మతులు చేపట్టనున్న కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. వెంకటగిరి పట్టణంలోని 132కేవీ సబ్‌స్టేషన్‌లో శనివారం చేపట్టనున్న మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈఈముని రవిచంద్ర శుక్రవారం తెలిపారు. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు. కోట మండలం చెందోడు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏడీఈ వరప్రసాద్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. కోట, వాకాడు మండలాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పూర్తిగా సరఫరా ఉండదని ఏడీఈ తెలిపారు.

పడవల రేవా... మందుబాబుల అడ్డానా?



పడవల రేవు వద్ద పడి ఉన్న మద్యం సీసాలు

తడ, మే 17: ఆ ప్రదేశం చూసేందుకు ఎంతో అందంగా ఉంటుంది. ఆహ్లాదకరంగా అనిపిస్తుంది. అటువంటి ప్రదేశం ఇప్పుడు మందుబాబులకు అడ్డాగా మారిందా... అంటే ఔననే సమాధానం వస్తుంది. అదే భీములవారిపాళెం పడవ రేవు. పులికాట్ సరస్సు ఒడ్డునే ఉండే ఈ రేవు పర్యాటకులను ఎంతో ఆకర్షిస్తుంది. అయితే ప్రస్తుతం ఆ ప్రదేశం మందుబాబులకు అడ్డాగా మారింది. ఎక్కడ చూసినా ఖాళీ మద్యం బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. రేవును శుభ్రపరచి ఆహ్లాదకరంగా ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

మండలంలో గరిష్ఠం... పట్టణంలో కనిష్ఠం

గూడూరు అర్బన్, మే 17: సార్వత్రిక ఎన్నికల్లో గూడూరు నియోజకవర్గంలోని మండలాల్లో విభిన్న పోలింగ్ శాతం నమోదైంది. నియోజకవర్గ పరిధిలో గూడూరు పట్టణంతోపాటు గూడూరు మండలం, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాలున్నాయి. నియోజకవర్గంలో 2,45,205 ఓట్లు ఉన్నాయి. ఇందులో గూడూరు మండలంలో 23,543 ఓట్లు ఉండగా 20,875 ఓట్లు పోల్‌కాగా 88.67శాతం పోలింగ్ నమోదైంది. గూడూరు పట్టణంలో 75,938 ఓట్లు ఉండగా 50,797 ఓట్లు పోలవడంతో పోలింగ్‌శాతం 66.89గా, చిల్లకూరు మండలంలో 41,196 ఓట్లు ఉండగా 35,246 ఓట్లు పోల్‌కాగా 85.56శాతం, కోట మండలంలో 42,334 ఓట్లు ఉండగా 33,763 ఓట్లు పోలవడంతో 79.75శాతం, వాకాడు మండలంలో 30,246 ఓట్లు ఉండగా 25,113 ఓట్లు పోలవడంతో 83.03శాతం, చిట్టమూరు మండలంలో 31.948 ఓట్లు ఉండగా 27,671ఓట్లు పోలవడంతో 86.61శాతం పోలింగ్ నమోదైంది. దీంతో ఈ ఎన్నికల్లో గూడూరు మండలంలో గరిష్ఠంగా 88.67శాతం పోలింగ్ నమోదు కాగా, గూడూరు పట్టణంలో కనిష్ఠంగా 66.89శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గ పరిధిలో 1,93,465 ఓట్లు పోల్‌కావడంతో 78.90శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

మల్లాం దళితవాడకు తాగునీటి సరఫరా పునరుద్ధరణ

చిట్టమూరు, మే 17: మల్లాం దళితవాడకు నిలిపివేసిన తాగునీటి సరఫరాను పునరుద్ధరించినట్టు ఈవోపీఆర్డీ మనోహర్ గౌడ్ చెప్పారు. ఈ నెల 10వ తేది మల్లాం దళితవాడకు సీపీడబ్ల్యూ స్కీం తాగునీటిని నిలిపివేయగా దళితులు ఆందోళన చేపట్టారు. ఎంపీడీవో నాగరాజు, ఎస్‌ఐ చిన్న బలరామయ్య ఆందోళనకారులతో చర్చించి ఎన్నికలు జరిగిన తరువాత సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమింప జేశారు. ఈక్రమంలో ఈవోపీఆర్డీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరవింద్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తాగునీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు.

టీడీపీ నాయకుడిపై హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

చిల్లకూరు, మే 17: మండలంలోని చింతవరం కొత్త పాళేనికి చెందిన టీడీపీ కార్యకర్త గోపాల్‌పై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో అదే గ్రామానికి చెందిన ముగ్గురిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ అంజిరెడ్డి తెలిపారు. ఈనెల 14న చింతవరం కొత్త పాళేనికి చెందిన గోపాల్ చింతవరంలోని తన ఎరువుల



నిందితులతో పోలీసులు

దుకాణంలో ఉండగా క్రాంతికుమార్, దిలీప్‌కుమార్, చెంచయ్య దాడి చేశారు. ఈక్రమంలో బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

'చలో వెంకటగిరి'ని జయప్రదం చేయండి



వెంకటగిరిలో పోస్టరును ఆవిష్కరిస్తున్న దళిత సంఘాల నాయకులు

డక్కిలి/ వెంకటగిరి, మే 17: వెంకటగిరి పట్టణంలో అంబేడ్కర్ విగ్రహ ధ్వంసానికి నిరసనగా ఈనెల 20న జరుప తలపెట్టిన చలో వెంకటగిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గద్దల మునెయ్య పిలుపు నిచ్చారు. శుక్రవారం డక్కిలిలో ఆయన చలో వెంకటగిరి కార్యక్రమ పోస్టర్లును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 12న విగ్రహాన్ని ధ్వంసం చేస్తే ఇప్పటి వరకు సంబంధిత వ్యక్తులను పోలీసులు గుర్తించకపోవడం బాధాకరమన్నారు. వెంకటగిరిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దోషులను వీలైనంత త్వరగా అదుపులోకి తీసుకుని శిక్షించాలని దళిత సంఘాల నాయకుడు జన్ని రమణయ్య అన్నారు. శుక్రవారం ఆయన అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. నవజీవన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సహదేవయ్య మాట్లాడుతూ... అంబేడ్కర్ అందరి వాడని, ఈ విధ్వంస ఘటనను అందరూ ముక్తకంఠంతో ఖండించి 20 వతేదీన జరగబోయే చలో వెంకటగిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. రామకృష్ణ, ధనుంజయ, గద్దల మునెయ్య, మల్లారం బాబు తదితరులు పాల్గొన్నారు.

ఐకేఎస్‌తో వేదవర్సిటీ ఎంవోయూ

తిరుపతిరూరల్, మే 17: వైదిక సాహిత్యంలో నిక్షిప్తమై ఉన్న వైజ్ఞానిక విశేషాలను వెలికితీసి సమాజానికి అందించేందుకు తిరుపతిలోని ఎస్వీ వేదవర్సిటీతో భారతప్రభుత్వ విద్యామంత్రిత్వశాఖకి చెందిన ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ (ఐకేఎస్) ఎంవోయూ కుదుర్చుకుంది. ఈమేరకు శుక్రవారం వర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి, ఐకేఎస్ జాతీయ కోఆర్డినేటర్ జి.సూర్యనారాయణ మూర్తి ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఐకేఎస్ కథనాలు రాయడం, పురాతన వేదగ్రంథాల ప్రామాణికమైన అనువాదాలను అన్ని భారతీయ భాషల్లోకి తీసుకురావడం ద్వారా కంటెంట్ అభివృద్ధి, మాన్యూస్క్రిప్ట్ డిజిటలైజేషన్, పురాతన పురాణాల నుంచి శాస్త్రీయ కంటెంట్‌తో సామాజిక ఔచిత్యంగల గ్రంథాలను గుర్తించడం, వాటిని సవరించడం, ప్రచురించడం, వేదమూలాలపై సెమినార్లు, వర్క్‌షాప్స్, కాన్ఫరెన్స్‌లు, వివిధ ఆచారాల ఆడియో-విజువల్ రికార్డులను రూపొందించడం వంటివి ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయని వీసీ వివరించారు. రిజిస్ట్రార్ రాధాగోవిందత్రిపాఠి, డీన్ గోలిసుబ్రహ్మణ్యశర్మ, రాధేశ్యామ్, ఎంపీఎస్ పవన్‌కుమార్, ఫైనాన్స్ ఆఫీసర్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపుల వర్షం

గూడూరు/ డక్కిలి/ వాకాడు, మే 17: గూడూరు పట్టణంలో శుక్రవారం తేలికపాటి వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా ఎండతీవ్రత అధికంగా ఉండడంతో ఉక్కపోతకు ప్రజలు అల్లాడిపోయారు. రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉండడంతో కొంత చల్లబడింది. శుక్రవారం సాయంత్రం తేలిక పాటి జల్లులు కురవడంతో ప్రజలు సేదతీరారు. డక్కిలిలో శుక్రవారం ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. ఎండ తీవ్రతకు అల్లాడిపోతున్న జనానికి ఈ వర్షం ఊరటనిచ్చింది. వర్షానికి అక్కడక్కడా చెట్లు కూలి విద్యుత్ లైన్లు తెగిపోవడంతో సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. విద్యుత్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన మర్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు. వాకాడులో కూడా గంటపాటు వర్షం కురిసింది. రబీ సీజన్ ప్రారంభంకావడంతో రైతులు పొలాలను దుక్కులు చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు.

ప్రభుత్వ భూముల్లో వెలుస్తున్న హోటళ్లు... దుకాణాలు





హైవే పక్కన పోరంబోకు భూమిలో ఏర్పాటు చేసిన దుకాణాలు, హోటళ్లు

దొరవారిసత్రం, మే 17: మండలంలోని నెలబల్లి వద్ద జాతీయ రహదారి పక్కన విలువైన ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా హోటళ్లు, దుకాణాలు వెలుస్తున్నాయి. రాజకీయ నాయకుల అండదండలతో గ్రామానికి చెందిన కొందరు ఎటువంటి అనుమతులు లేకుండా రహదారిని ఆనుకుని ఉన్న భూముల్లో దుకాణాలు, హోటళ్లు ఏర్పాటు చేసి ఉన్నారు. ప్రధానంగా గ్రామానికి సమీపంలోని తెలుగుగంగ కాలువ వంతెన వద్ద రహదారికి ఆనుకుని పోరంబోకు భూమితో పాటు, సర్వే నెం.20లోకి వచ్చే కొంత సీజేఎఫ్ఎస్ భూముల్లో ఏర్పాటు చేశారు. లారీలు నిలుపుదలకు సౌకర్యంగా ఉన్న ప్రాంతం కావడంతో రాజకీయ ప్రాబల్యం ఉన్న వ్యక్తులు ఈ ఆక్రమణకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఆ భూముల్లో పంచాయతీ భాగస్వామ్యంతో దుకాణాలు ఏర్పాటు చేస్తే ఆదాయం వస్తుంది. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. హోటళ్లు, దుకాణాల అక్రమ నిర్మాణాలు తమ దృష్టికి రాలేదని డీటీ గోపినాథ్ చెప్పారు. తహసల్దార్ సెలవులో ఉన్నారని ఆయన రాగానే సర్వే చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వారిద్దరినీ అరెస్టు చేయండి

ఎస్‌ఐ, వైసీపీ నాయకుడిపై మండిపడ్డ టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న పాశిం సునీల్‌కుమార్

గూడూరు, మే 17: ఎన్నికల్లో వైసీపీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించిన చిల్లకూరు ఎస్‌ఐ అంజిరెడ్డిని సస్పెండ్ చేయాలని, తమ పార్టీ నేతలపై దాడులకు ప్రోత్సహిస్తున్న చింతవరానికి చెందిన వైసీపీ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డిని అరెస్ట్ చేయాలని టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో పాశిం మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ఎవరకి ఇష్టం వచ్చినవారికి వారు ఓట్లు వేసుకుంటారన్నారు. వైసీపీకి ఓటు వేయని వారిపై ఆ పార్టీ నాయకులు దాడి చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. చింతవరంలో టీడీపీ కోసం పనిచేసిన కార్యకర్త జాలారి గోపాల్‌పై విష్ణువర్ధన్‌రెడ్డి తన అనుచరులతో దాడి చేయించడంతో గోపాల్ పరిస్థితి విషమంగా మారిందన్నారు. విష్ణువర్ధన్‌రెడ్డి రౌడీషీటర్ అని పోలీస్ అధికారులకు తెలిపినా అతన్ని హౌస్‌అరెస్ట్ చేయకుండా బూత్‌ల సందర్శనకు అనుమతి ఏలా ఇస్తారని ప్రశ్నించారు. గోపాల్ వాగ్మూలం తీసుకోకుండా కేసును నీరుగార్చేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారన్నారు. ఎన్నికల రోజు చిల్లకూరులో టీడీపీ నాయకుడు కొండా రామచంద్రారెడ్డిపై ఎస్‌ఐ అంజిరెడ్డి అమానుషంగా దాడిచేసి గాయపరిచారన్నారు. ఈ సంఘటనలపై ఎన్నికల కమిషన్‌కు, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, నాయకులు ఎన్.భాస్కర్‌రెడ్డి, పి.శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురెడ్డి, బి.చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, నరసింహులు, రవీంద్రరెడ్డి, జనార్దన రెడ్డి, పెంచలయ్య, రమణయ్య, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి టీడీపీ అభ్యర్థి నానీకి కురుగొండ్ల పరామర్శ

వెంకటగిరి, మే 17: ఈ ఎన్నికల్లో కూటమి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీని ఆయన నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా కురుగొండ్ల మాట్లాడుతూ... కొంతమంది పోలీసులు వైసీపీ నాయకులకు కొమ్ముకాయడం వల్లే దాడులు, విధ్వంసాలు తలెత్తాయన్నారు. పోలీసుల అండ చూసుకునే వైసీసీ మూకలు టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్నాయని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇంతమంది ఐఏఎస్, ఐపీఎస్‌లు బదిలీ, సస్పెన్షను గురికావడం దేశ చరిత్రలో ఇప్పటివరకు జరగలేదన్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద అయితే ఒకే ఒక కానిస్టేబుల్ నియమించడం దారుణమన్నారు.



దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకుంటున్న కురుగొండ్ల

అంచనాలకు అందని ఓటరు నాడి

- ఓటింగ్ సరళిపై ఎడతెగని సమీక్ష
- అధికార పార్టీకి క్రాస్ ఓటింగ్ బెడద

సూళ్లూరుపేట, మే 17: గతంలో ఎన్నడూ లేని విధంగా పోలింగ్ నమోదైంది. ఓటర్లు క్యూలైన్లలో గంటల కొద్దీ వేచి ఉండి మరీ ఓట్లు వేశారు. అయినా వారి నాడి అర్థం కాక బరిలో ఉండే అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. దీనికి తోడు ప్రధాన పార్టీల అభ్యర్థులకు లోలోపల అసమ్మతి బెడద ఎదురైంది. ఈ ప్రభావం ఎవరిపై పడుతుందో...



ఎవరి ఓట్లను కొల్లగొడుతుందో అంచనా వేయలేక మూడు రోజులుగా నాయకులు కుస్తీలు పడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన ఘట్టం పోలింగ్ ముగిసి నాలుగు రోజులు కావడంతో పోటీలో ఉన్న అభ్యర్థులు లోతైన విశ్లేషణలు చేస్తున్నారు. కూటమి అభ్యర్థులకు అసెంబ్లీ, పార్లమెంట్‌కు వేర్వేరు గుర్తులు ఉండటంలో క్రాస్ ఓటింగ్ ఎవరికి లాభం చేకూరుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లో కాంగ్రెస్‌కు కూడా ఓట్లు పోలయ్యాయని చర్చ సాగు తోంది. కాంగ్రెస్ పడిన ఓట్లు ఏ పార్టీకి లాభం చేకూరుతుందో, ఏ పార్టీకి నష్టం చేకూరుతుందో తెలియక తలలు పట్టుకొంటున్నారు. దీనికి తోడు ఈ సారి నిరుద్యోగులు, విద్యావంతులు, బెంగళూరు, చెన్నై, హైదరాబాదులో పని చేసే సాఫ్ట్‌వేరు ఇంజినీర్లు ఎన్నడూ లేని విధంగా సొంతూళ్లకు వచ్చి క్యూలో గంటల తరబడి నిలబడి మరీ ఓట్లు వేయడం గమనార్హం. ఇదంతా ప్రభుత్వ వ్యతిరేక ఓట్లని కూటమి అభ్యర్థులకు ఇది కలిసి వచ్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మహిళలు ఓట్లు కూడా పెరగడంతో వారి నాడి ఎవరికి అంతు బట్టడం లేదు. ఇది టీటీడీ ప్రవేశ పెట్టనున్న సూపర్ సిక్స్ పథకాల ఎఫెక్ట్ అని కూటమి అభ్యర్థులు చెబుతుంటే ఇది జగన్ మహిళలకు అందజేసిన సంక్షేమ పథకాలేనని వైసీపీ గట్టిగా నమ్ముతోంది. ఓటింగ్ పెరగడం, చీలికలు, క్రాస్ ఓటింగ్ ఎవరి స్థితిగతుల్ని మార్చేస్తాయోనని ఆందోళన చెందుతున్నారు.

అధికార పార్టీకి క్రాస్ ఓటింగ్ బెడద..

అధికార వైసీపీకి క్రాస్ ఓటింగ్ బెడద ఆ పార్టీ నేతలను కలవరపెడుతోంది. దీనికి తోడు కాంగ్రెస్ కూడా తమ ఓటుబ్యాంక్‌కు చీల్చిందని ఆందోళన చెందుతున్నారు. సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీల్లో క్రాస్ ఓటింగ్ అధికంగా జరిగిందని ఆ పార్టీకి చెందిన నాయకులే చెప్పుకుంటున్నారు. పొత్తులో భాగంగా సూళ్లూరుపేటలో అసెంబ్లీ టీడీపీ, ఎంపీ బీజేపీకి కేటాయించారు. దీంతో ఇక్కడ గుర్తులు మారడంతో భారీగా క్రాస్ ఓటింగ్ జరిగింది. ఇది టీడీపీ అసెంబ్లీ అభ్యర్థికి బాగా కలిసి వచ్చే అవకాశంగా భావిస్తున్నారు. ఈ క్రాస్ ఓటింగ్ విజయశ్రీని విజయతీరానికి చేరుస్తుందని ఆ పార్టీ నాయకులు ధీమాగా ఉన్నారు.


వెంకటగిరిలో దంచికొట్టిన వాన

వెంకటగిరి, మే 17: అనూహ్య వర్షం కొందరికి ఉపశమనాన్ని కలిగిస్తే మరి కొందరికి ఇబ్బందికరంగా మారింది. ఉరుములు మెరుపులతో సుమారు గంటపాటు కురిసిన వర్షానికి స్థానికులు అసౌకర్యానికి గురయ్యారు. ఎన్టీఆర్ కాలనీలో రోజుల తరబడి మురుగు నీటి కాలువల్లో చెత్త తీయకపోవడంతో శుక్రవారం కురిసిన వర్షానికి మురుగు రోడ్లపై ప్రవహించింది. అలాగే పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ వర్షానికి చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో పలు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్‌కో సిబ్బంది అప్రమత్తం కావడంతో రెండు గంటల్లో తిరిగి విద్యుత్ సమస్య తీరింది.



ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిలిచి ఉన్న నీరు

కుట్టు మెషిన్ వితరణ



వెంకటగిరి, మే 17: పట్టణంలోని తోలుమిట్టకు చెందిన కవితకు శ్రీకృష్ణదేవరాయ కాపు, బలిజ ట్రస్టు ఆధ్వర్యంలో కుట్టు మెషిన్ వితరణ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు టి.కృష్ణయ్య మాట్లాడుతూ... మున్ముందు ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడుతామన్నారు. కె. వెంకటేశ్వర్లు, కె.తిరుపాలు, పి.తులసీదాస్, ఎం.రవీంద్ర, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

కోట, మే 17: కోట దళితవాడలో వివాహితపై అదే దళితవాడకు చెందిన కోటమ్మ, మరో ఐదుగురు మహిళలు దాడి చేయడంతో బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగబాబు శుక్రవారం తెలిపారు. గత కొంతకాలంగా సరిత, కోటమ్మ మధ్య స్థల వివాదం ఉంది. ఈ నేపథ్యంలో వివాదం ముదిరి సరితపై దాడి చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

కోట, మే 17: గ్రామాల్లో ప్రజలు కోరిన చోటే ఉపాధి హామీ పథ కం పనులు మంజూరు చేయాలని, ఇష్టానుసారంగా పనులు నిర్వహిస్తే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఉపాధి హామీ పథక అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వరప్రసాద్



పనులను తనిఖీ చేస్తున్న ఏపీడీ

హెచ్చరించారు. మండలం లోని సిద్ధవరం, ఉత్తమనెల్లూరు పంచాయతీల్లో ఉపాధి హామీ పనులను శుక్ర వారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలకు, సిబ్బందికి పలు సూ చనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి కుటుంబానికి వందరోజుల పనులు కల్పిం చాల్సిందే అన్నారు. తేడాలొస్తే సంబంధిత క్షేత్ర సహాయకులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈసీజన్‌లో పశువులు తాగే నీటిగుంటలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పూర్ణిమ, టెక్నికల్ అసిస్టెంట్ శాంతి, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.63 కోట్లు

తిరుమల, మే 17 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.63 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 76,369 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 41,927 మంది తలనీలాలు సమర్పించారు.



కాకినాడ బ్యాండ్ మేళా

కోటమ్మ ఉత్సవాలు ప్రారంభం

కోట, మే 17: మండలంలోని తిన్నెలపూడిలో శుక్రవారం తెల్లవారు జామున గ్రామదేవత కోటమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఊరేగింపులు, బ్యాండు మేళాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నలప్పరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి నివాసమైన కోట నుంచి అమ్మవారి నగలు, గంగపెట్టె, మేళ తాళాలతో తిన్నెల పూడికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి తిన్నెలపూడి గ్రామస్థులు మేకపోతులు, పొట్టేళ్లతో ఎదురు



అమ్మవారి గ్రామోత్సవం

పొంగళ్లు నిర్వహించారు. కాకి నాడ బ్యాండ్ ఆధ్వర్యంలో నృత్యాలను ఏర్పాటు చేసి కోటమ్మ ఉత్సవ విగ్ర హాన్ని తిన్నెలపూడి, లక్ష్మక్కకండ్రిగల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మ వారు ఊరేగుతున్న సమయంలో ఆయా గ్రామాల భక్తులు అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి ఎదురు పొంగళ్లు నిర్వహించారు. దశాబ్దకాలం తరువాత ఈ తరంనాటి యువతి, యువకుల ఆధ్వర్యంలో కోటమ్మ అమ్మవారి ఉత్సవాలు కనులపండువగా నిర్వహించారు.

బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు ప్రారంభం

సూళ్లూరుపేట, మే 17: పట్టణంలోని జీఎన్‌టీ రోడ్డులో ఉన్న విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి మఠం లో శుక్రవారం నుంచి ఆరాధనోత్సవాలు ఘనంగా ప్రారంభ మయ్యాయి. ఆలయ



పుష్పాలంకరణలో బ్రహ్మేంద్రస్వామి దంపతులు

కమిటీ అధ్యక్షుడు చిట్టేటి పెరుమాల్ ఆధ్వర్యంలో ఉదయం మఠం వద్ద గో పూజ చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గణపతి పూజ అనంతరం స్వామివారి మఠం ముందు ఏర్పాటు చేసి హోమగుండంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి కల్యాణం వైభవంగా జరగనుంది. కమిటీ సభ్యులు చెంగయ్య, బట్టా సుబ్రమణ్యం తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

20నుంచి కరిమాణిక్యస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు




నాయుడుపేట, మే 17: పట్టణానికి సమీపంలో ఉన్న తుమ్మూరులోని శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యస్వామి దేవస్థానంలో 20వ తేది నుంచి టీటీడీ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. 20న అంకుర్పాణ, 21న ధ్వజారోహణం, రాత్రి శేషవాహనసేవ, 22న తిరుచ్చి ఉత్సవం, రాత్రి హనుమంతసేవ, 23న ద్వారదర్శనం, రాత్రి గరుడవాహనసేవ, 24న తిరుచ్చి ఉత్సవం, రాత్రి హంసవాహనం, 25న తిరుచ్చి ఉత్సవం, రాత్రి విమానోత్సవం, 26న మోహినీ ఉత్సవం, సింహవాహనం, గజవాహన సేవలు, కల్యాణం, 27న రథోత్సవం, 28న తిరుచ్చి ఉత్సవం, రాత్రి పార్వేట ఉత్సవం, 29న వసంతోత్సవం, రాత్రి ధ్వజావరోహణం, 30న పుష్పయాగం, రాత్రి ఏకాంతసేవ జరుగుతాయి.

లక్ష్మీనరసింహస్వామి జయంతి మహోత్సవాలు

వెంకటగిరిటౌన్, మే 17: మండలంలోని వల్లివేడు(9వ బెటాలియన్) సమీపంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి 64వ జయంతి మహోత్సవాలు 22వ తేది సుప్రభాత సేవతో ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. అభిషేకం, స్వామివారి కల్యాణం, అన్నదానం, చందనాలంకారం, భజన, గరుడోత్సవం నిర్వహించనున్నారు. 23వ తేది పొంగళ్ల సమర్పణతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఏకొల్లువాసికి డాక్టరేట్ ప్రదానం

దొరవారిసత్రం, మే 17: మండలంలోని ఏకొల్లువాసి కన్నలి తిరుపాలయ్యకు గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. తిరుపాలయ్య నాయుడుపేట సెజ్ జిలా కమిషనర్‌గా పని చేస్తు న్నారు. ఆయనకు ఆచార్య నాగార్జున వర్శిటీలోని జర్న లిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. వర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ జి.అనిత ఆధ్వర్యంలో 'ఇంపాక్ట్ ఆఫ్ అడ్వర్టైజ్మెంట్స్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు సెమియోటిక్స్ అండ్ అదర్ ఫ్యాక్టర్ - ఏ స్టడీ ఆఫ్ కస్టమర్ పెర్సెప్షన్ ఇన్ అమరావతి క్యాపిటల్ రీజియన్' అనే అంశంపై పరిశోధన చేశారు.



తిరుపాలయ్య

ఉపాధి కూలీల ధర్నా

పెళ్లకూరు, మే 17: తమకు కూలీలు చెల్లించాలంటూ మండలంలోని శిరసనంబేడుకు చెందిన ఉపాధిహామీ కూలీలు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తాము ఆరు రోజుల పాటు కూలి చేస్తే మూడు రోజులకు మాత్రమే బిల్లు పెట్టారన్నారు. మిగితా మూడు రోజులు పనులకు సంబంధించిన వేతనాలను పనులకు రాని వారి పేర్లు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం ఎంపీడీవోకు, ఏపీవోకు వినతిపత్రం అందజేసి న్యాయం చేయాలని కోరారు.